APTEL/2023/88044

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ

సంపుటి : 01 | సంచిక : 237 | ఎడిటర్ : ఎం. రమేష్ | ఆదివారం, జులై 28, 2024 | పేజీలు : 08 | వెల రూ. 5.00/-

## ఆడపిల్లలను వేధిస్తే తాట తీయండి





6

### వెంకటగిరిలో పోకిరీల ఆట కట్టించండి
### ఫిర్యాదులపై స్పందించి..పోలీసులకు హుకూం
### అర్జీల స్వీకరణలో తక్షణ పరిష్కారికి పవన్ ఆదేశాలు

ఏపీ డిప్యూటీ సీఎం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. బాధ్యతలు స్వీకరించిన దగ్గరి నుంచి ప్రజా సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేస్తున్నారు. తనకు వచ్చిన దరఖాస్తులను వెను వెంటనే పరిశీలించి పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. 'జనవాణి - జనసేన - భరోసా' పేరిట పవన్ కళ్యాణ్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ఆడపిల్లలను వేధిస్తే తాట తీయండి అని పోలీసులు ఆదేశించారు. తిరుపతిలో జులాయిల ఆట కట్టించండని అన్నారు. ఫిర్యాదులపై స్పందించి.. పోలీసులకు హుకూం జారీ చేశారు. అమరావతి,జూలై27(పీపుల్స్ మోటివేషన్):

## ప్యారిస్ ఒలంపిక్స్ వేడుకల్లో చిరంజీవి దంపతులు

### ఫోటోను షేర్ చేసిన చిరు



హైదరాబాద్,జూలై27(పీపుల్స్ మోటివేషన్): ప్రపంచమంతా అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఒలింపిక్స్ వేడుకలు పారిస్‌లో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు చూసేందుకు పలువురు సినీ తారలు, సందర్శకులు తరలివచ్చారు. అగ్ర కథానాయకుడు చిరంజీవి కుటుంబం ఒలింపిక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న విషయం తెలిసిందే. ఈమేరకు తన సతీమణి సురేఖతో కలిసి దిగిన ఓ ఆసక్తికర ఫొటోని తాజాగా ఆయన ఎక్స్‌లో షేర్ చేశారు. పారిస్ వేదికగా జరుగుతోన్న ఒలింపిక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైనందుకు చాలా ఆనందంగా అనిపిస్తుంది. సురేఖతో కలిసి ఒలింపిక్ టార్చ్ ప్రతిరూపాన్ని పట్టుకోవడం సంతోషకరమైన క్షణం. ఈ పోటీల్లో పాల్గొంటున్న భారత క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్. పతకాలు తీసుకురావాలని కోరుకుంటున్నా' అని రాసుకొచ్చారు. చిరంజీవి ప్రస్తుతం 'విశ్వంభర' కోసం వర్క్ చేస్తున్నారు. వశిష్ట దర్శకత్వంలో ఇది తెరకెక్కుతోంది. వర్క్ లైఫ్ నుంచి కాస్త విరామం తీసుకున్న చిరంజీవి తన సతీమణి సురేఖతో కలిసి లండన్ టూర్‌కు వెళ్లారు. రామ్‌చరణ్, ఉపాసన, క్లీంకార సైతం ఈ టూర్‌లో భాగమయ్యారు. ఈ విహారయాత్రకు సంబంధించిన పలు ఫొటోలను ఉపాసన సోషల్‌మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. అవి నెట్టింట వైరల్‌గా మారాయి. మరోవైపు, రామ్‌చరణ్ ప్రస్తుతం 'గేమ్ ఛేంజర్' కోసం వర్క్ చేస్తున్నారు. శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో కియారా అద్వాణీ కథానాయిక. క్రిస్మస్‌కు ఇది విడుదల కానుందని నిర్మాత దిల్‌రాజు తెలిపారు.

## పోలవరం బకాయిలు చెల్లించండి

### కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌తో బాబు భేటీ

**న్యూఢిల్లీ,జూలై27(పీపుల్స్ మోటివేషన్) :**

జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ఏపీ సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. నీతి ఆయోగ్ భేటీ అనంతరం ఆయనతో ప్రత్యేకంగా సమావేశమై పోలవరం ప్రాజెక్టు అంశంపై చర్చించారు. తాజా ప్రతిపాదనలకు ఆమోదం తెలపాలని కోరారు. అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. వైకాపా హయాంలో పోలవరం ప్రాజెక్టును నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ చేసిన నష్టాన్ని పూడ్చే బాధ్యత ప్రజలు ఎన్డీయేకు అప్పగించారన్నారు. పోలవరానికి సంబంధించి పాతబకాయిలు ఇవ్వాలని కోరామని తెలిపారు. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం ఇష్టారాజ్యంగా కేంద్రం నిధులను దారి మళ్లించిందని, ఇదే విషయాన్ని కేంద్రంలోని ఆయా శాఖలు చెబుతున్నాయన్నారు. నవంబర్ నాటికి పోలవరం నిధులు విడుదల చేస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, తెదేపా ఎంపీలు సీఎం చంద్రబాబు వెంట ఉన్నారు.

## భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు

### అదనపు ఈవో వెంకయ్య చౌదరి

**తిరుమల,జూలై27(పీపుల్స్ మోటివేషన్):**



తిరుమల తిరుపతి దేవస్థానం అదనపు ఈవోగా వెంకయ్య చౌదరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు శ్రీవారిని దర్శించుకుని వేదపండితుల ఆశీర్వచనం పొందారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. సామాన్య భక్తులకు వేగంగా దర్శనం కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. వేంకటేశ్వరుని ఆశీస్సులతో తితిదే అదనపు ఈవోగా బాధ్యతలు స్వీకరించడం అదృష్టంగా భావిస్తున్నట్టు వెంకయ్య చెప్పారు. తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు తిరుమల క్షేత్ర సాంప్రదాయాన్ని పాటిస్తూ భూ వరాహస్వామిని దర్శించుకున్నారు.

## మీ ధర్నాకు.. మా సంఘీభావం ఎందుకు

### బిజెపితో అంటకాగినందుకు ఇవ్వాలా
### మణిపూర్ ఘటనలపై నోరు మెదపనందుకా
### ఎక్స్ వేదికగా ..జగన్ వ్యాఖ్యలపై షర్మిల ఘాటు విమర్శలు

**అమరావతి,జూలై27(పీపుల్స్ మోటివేషన్):**

జగన్.. మీ ధర్నాకు సంఘీభావం ఎందుకు ప్రకటించాలని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. పార్టీ ఉనికి కోసం దిల్లీలో కపట నాటకం ఆడినందుకా? వ్యక్తిగత హత్యకు రాజకీయ రంగు పులిమినందుకా? 5 ఏళ్లు భాజపాతో అక్రమ సంబంధం పెట్టుకుని విభజన హక్కులు, ప్రత్యేక హోదాను వారికి తాకట్టు పెట్టినందుకా? మణిపుర్ ఘటనపై ఇన్నాళ్లు నోరెత్తని మీకు ఉన్నట్లుండి అక్కడి పరిస్థితులు గుర్తుకురావడం విడ్డూరం అంటూ విమర్శలు ఎక్కుపెట్టారు. విపక్షాలు పెట్టిన అవిశ్వాస తీర్మానంలో భాజపాకే మద్దతు ఇచ్చారు కదా? వైఎస్ఆర్ వ్యతిరేకించిన మతతత్వ భాజపాకే జై కొట్టారు కదా? మణిపుర్ ఘటనపై కాంగ్రెస్ దేశవ్యాప్త ఉద్యమం చేస్తుంటే మీ నుంచి సంఘీభావం వచ్చిందా? మీ నిరసనలో నిజం లేదని తెలిసే కాంగ్రెస్ పార్టీ దూరంగా ఉంది. అందులో జగన్ స్వలాభం తప్ప... రాష్ట్రానికి ప్రయోజనం శూన్యమని తెలిసే కాంగ్రెస్ పార్టీ సంఘీభావం తెలపలేదు. సిద్ధం అన్న వాళ్లకు 11 మంది బలం సరిపోలేదా.. ఇప్పుడు కలిసి పోరాడుదాం అంటున్నారని షర్మిల విమర్శించారు. ఏపీ రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి షర్మిల తన సొంత అన్న అని చూడకకుండా జగన్‌పై విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. ఏపీసీసీ చీఫ్ హోదా చేపట్టాక.. తన మాటలకు మరింత పదును పెట్టారు. వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలపై సొంత అన్నపైనే షర్మిల ఎదురుదాడికి దిగారు. తాజాగా మరోసారి జగన్‌ను టా÷-గ్గ్÷ట్ చేస్తూ షర్మిల మాటల తూటాలు పేలారు. ఏపీలో శాంతిభద్రతలు అదుపుతప్పాయంటూ ఇటీవల ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జగన్ ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఈ ధర్నాకు కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమితో పాటు విపక్ష ఇండియా కూటమి కూడా జగన్ ఆహ్వానం పంపారు. అయితే ఎన్డీయేలో ఉన్న టీడీపీకి వ్యతిరేకంగా మిత్రపక్షాలు మాట్లాడలేరు కాబట్టి వారంతా ధర్నాకు దూరంగా ఉన్నారు. అయితే ఇండియా కూటమిలోని కీలక పార్టీల నుంచి పలువురు నేతలు జగన్ ధర్నాకు వచ్చి మద్దతు తెలిపారు. కానీ.. కాంగ్రెస్ మాత్రం దూరంగా ఉండిపోయింది. దీనిపై ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ధర్నాకు ఎందుకు మద్దతు ప్రకటించలేదని జగన్ ప్రశ్నించారు. దీనిపై తాజాగా షర్మిల్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ జగన్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ ఎందుకు రాలేదో సమాధానం చెప్పాలంటున్న జగన్ గారు... మీ ధర్నాకు సంఘీభావం ఎందుకు ప్రకటించాలని అంటూ తిరిగిప్రశ్నించారు.




## వచ్చే 25 ఏళ్లలో వికసిత్ భారత్

5

### ప్రతి ఇంటికీ తాగునీరు, విద్యుత్‌పై చర్చ
### రాష్ట్రాల సహకారంతోనే సాధ్యం
### నీతి ఆయోగ్ తొమ్మిదవ గవర్నింగ్ కౌన్సిల్
### ప్రధాని మోడీ అధ్యక్షతన రాష్ట్రపతి భవన్‌లో భేటీ
### పలు రాష్ట్రాల సిఎంల గైర్హాజరు..మమత వాకౌట్
### వివరాలు వెల్లడించిన సిఎఇవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం



తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

## సంపాదకీయం

# పార్లమెంట్..నీతి ఆయోగ్‌ల ప్రతిష్ట పెరగాలి!

బడ్జెట్ సమావేశాల్లో కూడా అధికార పార్టీ తీరు మారడం లేదు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు నింపాదిగా, సమయోచితంగా, ప్రజలు మెచ్చుకునేలా సమాధానాలు ఇవ్వడంలో మంత్రులు విఫలం అవుతున్నారు. నీట్‌పై జరిగిన చర్చలో ఇది కనిపించింది. ఇకపోతే సమావేశాల సందర్భంగా నిత్యం సభలో ప్రధాని ఉండడం లేదు. సమస్యలను లేవనెత్తినప్పుడు లేచి సమాధానం ఇవ్వడం బాధ్యత. తెలంగాణకు బడ్జెట్ కేటాయింపుల విషయంలో ఆందోళన వ్యక్తం అవుతున్న వేళ కనీసంగా కేంద్రం బాధ్యతగా ఇంతవరకు సానుకూల సమాధానం ఇవ్వలేదు. నీతి ఆయోగ్ సమావేశాల్లో చర్చలు కూడా నిష్ఫలం అవుతున్నాయి. అక్కడ కేంద్ర రాష్ట్రాల సమస్యలపై చర్చించడం లేదు. తాజాగా శనివారం జరుగుతున్న నీతి ఆయోగ్ సమావేశానికి తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి సహా పంజాబ్, కేరళ, జార్ఖండ్ తదితర రాష్ట్రాల సిఎంలు దూరంగా ఉన్నారు. ఇది చాలా సీరియస్‌గా ఆలోచన చేయాల్సిన అవసరం కేంద్రంపై ఉంది. వారు లేకుంటే ఆయా రాష్ట్రాల ప్రాతినిధ్యం లేనట్లుగా గుర్తించి, వారిని పిలిచి మాట్లాడాలి. ఇకపోతే బిజెపియేత రాష్ట్రాల సిఎంలు లేవనెత్తే సమస్యలపై అధికార బిజెపి పార్టీకి చెందిన ఎంపిలు, కేంద్ర మంత్రులు ఎదురుదాడితో దాటవేయడం సరికాదు. బడ్జెట్‌లో లోటుపాట్లను గుర్తించి... ప్రధాని మోడీ కూడా ఎందుకు ఇలా జరిగిందో చూస్తానని చెప్పలేక పోయారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటే నిధులు ఇవ్వకూడదా అన్నది చెప్పాలి. మీరిచ్చే నిధులు కాంగ్రెస్ పార్టీకి ఇస్తున్నారా అన్నది చెప్పాలి. నిరుద్యోగం, ధరల పెరుగుదల, జిఎస్టీ తదితర సమస్యలపై ఎందుకు చర్చించరో చెప్పడం లేదు. విభజన సమస్యలపై విధివిధానాలు లేకుండా పదేళ్లు గడిపారు. భారతదేశం,ప్రజాస్వామ్యం గురించి గొప్పలు చెప్పడం మనకు బాగా అలవాటయ్యింది. అయితే చట్టసభల్లో చర్చించకుండానే చట్టాలు వస్తున్నాయి. చట్టసభల్లోచర్చించకుండా సమస్యలను దాట వేస్తున్నారు. ఎందుకిలా చేస్తున్నామన్న ఆలోచనచేయడం లేదు. రాబోయే తరాలకు ఎలాంటి సందేశం ఇవ్వబోతున్నారో చెప్పడం లేదు. అధికార, విపక్షాలు తమ రాజకీయ ఎజెండాతో పనిచేయడం వల్లనే ఇలా జరుగుతోంది. ఇలా ఒక్క సమస్యపైనా చర్చించకుండా కాలం గడిపేస్తున్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన పార్లమెంట్ అధికారంలో ఉన్న ఒకరిద్దరు నేతల కనుసన్నల్లో సాగుతున్నాయి. పార్లమెంటులో చర్చ అన్నది ప్రజలకు సంబంధించిన వ్యవహారం. ఇదేదో అధికార,విపక్షాల సమస్యగా చూస్తున్నారు. ఇక్కడ 140కోట్ల ప్రజలంతా ఆందోళనలతో ఉన్నా పట్టించుకోవం లేదు. వరదలతో దేశం మునుగుతున్నా చర్చించడం లేదు. భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మేడిపండు చందంగా మారిందా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. వ్యక్తిస్వామ్యం,నిరంకుశత్వం ప్రబలి పోతోంది. పార్లమెంట్, అసెంబ్లీల్లో ప్రజల సమస్యలపై చర్చ జరగడం లేదు. అధికార విపక్షాలు కలసి ఇదేదో తమ సొంత జాగీరుగా భావించి.. సమావేశాలను నడుపుకుంటున్నారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ఇదే తంతు సాగుతోంది. బిజెపి అధికారం చేపట్టిన తరవాత అసలు సమస్యలపై చర్చ అన్నది మరచిపోయారు. గతంలో వాజపేయ్, అద్వానీ, పివి నసింహారావుల హయాంలో కూడా సమస్యలపై చర్చ జరిగేది. వారు నిత్యం సమావేశాల్లో పాల్గొనే వారు. కానీ ప్రస్తుతం సమస్య ఏదైనా పార్లమెంటులో చర్చకు రావడం లేదు. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీల్లో ఇదే పద్దతి సాగుతోంది. రాష్ట్రాల్లో కూడా అధికార పార్టీ నేతలు చర్చలకు అవకాశం ఇవ్వడం లేదు. నిరుద్యోగం, దేశంలో పెరుగుతున్న ధరలు, జీఎస్టీ పెంపు, వరదలు లాంటి అంశాలపై చర్చించి జవాబివ్వాలని ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్‌ను ప్రభుత్వం ఏమాత్రం పట్టించు కోవడం లేదు. ఏటా వరదలు వస్తున్నాయి. నీరంతా వృధాగా సముద్రంలో కలిసి పోతోంది. వరదల్లో ప్రజలు మునిగి పోతున్నారు. అయినా పట్టింపు లేదు. మోడీ పదేళ్ల అధికారంలో ఈ సమస్యలపై ఏనాడూ చర్చించ లేదు. సమస్యలను సమస్యగా చూడడం మానేశారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన ప్పుడల్లా ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రతి అంశంపై చర్చించడానికి తాము సిద్ధమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి, ప్రధాని ప్రకటించడం ఆనవాయితీగా మారింది. తొలిరోజు ప్రధాని మోడీ కూడా సభ సజావుగా సాగాలని, ఈ సమావేశాలకు ప్రాధాన్యం ఉంటుందని అంటున్నారు. అయితే పార్లమెంట్ సమావేశమైన తర్వాత అలాంటి సుహృద్భావ వాతావరణం మాత్రం కనపడడం లేదు. నిజంగా ఎందుకు ఇలా చేస్తున్నారో బిజెపి అగ్రనేతలు చెప్పాలి. ఎందరో కొత్త సభ్యులు పార్లమెంట్ గడప తొక్కారు. పార్లమెంట్‌ను నడిపించేం దుకు రాజనీతిజ్ఞత అవసరం. మనం ఉన్నదే ప్రజల కోసం అన్న కోణంలో అధికార పక్షం ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండి.. సమస్యలపై చర్చించడం ద్వారా ప్రజలకు సందేశం ఇవ్వాలి. చట్టసభల్లో ప్రజా సమస్యలను చర్చించేందుకు విపక్షాలకు అవకాశం ఇవ్వాలి. వారు సమస్యలను ప్రస్తావిస్తే చర్చించాలి. వారిచ్చే సూచనలను పరిగణన లోకి తీసుకోవాలి. చర్చల ద్వారా ప్రజల మనోగతాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయాలి. అప్పుడే చట్టసభల కు విలువ ఉంటుంది. గతంలో ఎప్పుడూ చర్చలకు ప్రాధాన్యం ఉండేది. సమస్యలపై తక్షణ చర్చలు చేపట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. చట్టసభలకు గౌరవం ఇనుమడించేలా అధికార విపక్షాలు కలిసి పనిచేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. చట్టసభలను పాలకులే ఎక్కువగా గౌరవించాలి. ప్రజల సమస్యల పై చర్చించడం అలవాటు చేసుకోవాలి. ప్రజల సమస్యలపై చర్చించిన తరవాతనే విధాన నిర్ణయాలు తీసు కోవాలి. లేకుంటే ప్రజా సమస్యలు పార్లమెంట్ దాకా రావు. పార్లమెంటులో మంచి సంప్రదాయం నెలకొల్పేం దుకు బిజెపి నేతలు ముందుకు రాకుంటే వారికి కూడా చరిత్రగుణ పాఠం చెప్పడం ఖాయం. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివిధ రూపాల్లో చర్చించేం దుకు ఉన్న అవకాశాలను వినియోగించు కోవాలి. ఎందుకంటే నిరుద్యోగం వారికి కనపడడం లేదు. ధరల పెరుగుదల వారి లెక్కలోకి రావడం లేదు. వరదలు, ప్రజల బాధలు వారి లెక్కల్లో లేవోమో. ఇలాంటి పరిస్థితులను అధిగమించి కొత్త సంప్రదాయాలను నెల కొల్పాలి. భారత పార్లమెంట్ ప్రతిష్టను ఇనుమడింప చేయాలి. నీతి ఆయోగ్ ప్రతిష్టను కూడా పెంచేలా చేయాలి.

# నిరంకుశ పాలనతో రాష్ట్రాలు కుదేలు

**ప్రజాగ్రహంలో కొట్టుకుపోయిన నేతలు**
**ఆత్మవిమర్శతో పాలన చేస్తేనే అభివృద్ధి**

**న్యూఢిల్లీ,జూలై27(పీపుల్స్ మోటివేషన్):**


అధికారం శాశ్వతమని ఏ రాజకీయ పార్టీ అయినా అనుకుంటే పొరపాటు. వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు ఆర్థిక క్రమశిక్షణతో పాటు,రాజకీయ క్రమశిక్షణ కూడా పాటించకుంటే మట్టికరచి పోతాయని గతంలో అనేక సందర్భాల్లో చూశాం. ఇటీవలి ఎన్నికల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇదే జరిగింది. నిరంకుశంగా పాలించి, అప్పులను మిగిల్చిన నేతల్లో పాశ్చాత్తాపం కానరావడం లేదు. వీరి పాలన దేశానికి ఓ హెచ్చరిక కావాలి. ప్రజలు క్షేత్రంగా చేసుకుని పాలన చేయాలి. ప్రజాగ్రహంలో ఎన్టీఆర్ లాంటి వారు కూడా కొట్టుకు పోయారు. ఎపిలో జగన్ ప్రభుత్వం విపక్షాలను అణచివేయడం, కేసులు పెట్టడంలో ప్రత్యేక శ్రద్ద తీసుకున్నందుకు యమూల్యం చెల్లించుకుంది. తాను పుట్టి పెరిగిన పార్టీలను అణగ దొక్కడంలో కెసిఆర్ ఎలాంటి వెనకడుగు వేయలేదని రాష్ట్ర రాజకీయాలను చూస్తే అర్థం చేసుకోవచ్చు. కాంగ్రెస్, టిడిపిలు తెలంగాణలో ఉనికి లేకుండా పోవాలని కెసిఆర్ వేసిన ఎత్తుగడలు ఫలింలేదు. ఇప్పుడు ఆయనకే ఉనికిలేకుండా పోయింది. ఇక తెలంగాణలో తొలుత తెలుగుదేశం పార్టీని, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీని కోలుకోకుండా దెబ్బతీసిన కేసీఆర్, ఇప్పుడు ఇంతటి విపత్కర ఎదుర్కో వాల్సి వస్తుందిన ఊహించి ఉండక పోవచ్చు. విపక్షాలు పుంజుకోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఓ రకంగా అది కెసిఆర్ వైఫల్యంగానే చూడాలి. ప్రజల్లో నిరసనలు నివురుగప్పితే నాయకుడనేవాడు ఏ పార్టీలో అయినా పుట్టుకుని వస్తారని గమనించాలి. ఈ కారణంగా కేసీఆర్‌కు ప్రత్యామ్నాయం కావాలనుకున్న వారికి కాంగ్రెస్ పార్టీ కనిపించింది. రేవంత్ రెడ్డిని ప్రత్యమ్నాయ నేతగా చూసి ఎన్నకున్నారు. అయినా కెసిఆర్ ఆయన కుటుంబ పార్టీలో మార్పు కానరావడం లేదు. ఎపిలో కూడా అరాచక పాలన సాగించిన జగన్ ఇప్పుడు టిడిపి ప్రబుత్వం అరాచకం చేస్తోదని గగ్గోలు పెడుతున్నారు. ప్రజలు ఓటుతో పక్కకు తప్పించడంతో కళ్లు బైర్లు కమ్మాయి. ప్రజాస్వామ్యం గురించి ఇప్పుడు జగన్ పలవరిస్తున్నారు. బెంగాల్లో కమ్యూని స్టులు ఇదే ధోరణిలో 30ఏళ్లపాటు రాజ్యమేలారు. తమకు తిరుగు లేదన్న ధోరణిలో వారు ప్రజల ఆశలను, ఆకాంక్షలను పట్టించు కోలేదు. తమ నిరంకుశ పాలనకు ప్రజాస్వామ్యం, అభివృద్ధి ముసుగేసారు. కానీ అక్కడా మమతా బెనర్జీ లాంటి వారు పుట్టుకుని వచ్చారు. కమ్యూనిస్టులను కూకటి వేళ్లతో పెకిలించారు. అయితే ఆమె కూడా అదే ధోరణిలో నిరంకుశ పాలన సాగించడంతో ఇప్పుడు మమతా బెనర్జీ పునాదులు కూడా కదులు తున్నాయి. కర్నాటకలో బిజెపి పాలనలను ఈసడించుకున్న ప్రజలు అక్కడ కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో కూడా మోడీకి ప్రజలు గట్టి దెబ్బనే కొట్టారు. గతంలో 320 సీట్ల వరకు సంపాదించిన బిజెపి 240 సీట్లకు పరిమితం అయ్యింది. ఎన్‌డిఎ మిత్రపక్షాల ఊతకర్రతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. అప్పుల కుప్ప చేసి పథకాలను ప్రకటించి ప్రజలను ఓట్ల రూపంలో మలచుకోవడంలో అధికార పార్టీ నేతలు ఆరితేరారు. దీంతో రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నాయి. ఈ అప్పులు ఇప్పుడు తీర్చే శక్తి కూడా రాష్ట్రాలకు లేకుండా పోతున్నది. అందుకే ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి. కెసిఆర్ లేదా జగన్ తన ఇష్టం వచ్చినట్లుగా ముందుకు సాగుతూ ప్రజలను విశ్వాసంలోకి తీసుకోకుండా, కేవలం తన సొంత నిర్ణయాలతో మభ్యపెట్టే ప్రయత్నాలు చేసి దివాళా తీయించారు. వరదలు వస్తే గట్టిగా వారి పక్షాన నిలబడి ఆదుకునే ప్రయత్నాలు సాగడం లేదు. అన్నింటికీ మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నాలు మంచిది కాదు. ప్రజల్లో గూడు కట్టుకుంటున్న అసంతృప్తిని పసిగట్టడంలో ఇద్దరు నేతలు విఫలమవుతున్నారు. బిఆర్‌ఎస్ పార్టీలో ప్రజాస్వామ్యాన్ని మచ్చుకు కూడా కనిపించకుండా అంతా తామే అన్నట్టుగా కెసిఆర్, కెటిఆర్ వ్యవహారాలు నడిపారు. ప్రగతిభవన్ ఛాయలకు ఎవరు రాకుండా చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎంపిలకు కూడా పర్మిషన్ ఉండాల్సిందే. అధికారం అంతా ఒక కుటుంబం వద్దనే కేంద్రీకృతమై ఉందన్న ఆరోపణలనిఉ నిర్లక్ష్యం చేశారు. పెరిగాయి. క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాలను తెలుసుకునే ప్రయత్నం చేయకుండా మీడియాను దూరం పెట్టారు. కేసీఆర్, జగగన్‌లు చిన్నపాటి విమర్శలను కూడా స్వీకరించలేని స్థితికి చేరుకున్నారు. ఫలితంగా ప్రజల మనోభావాలను తెలియ జేయడానికి పార్టీలో కూడా ఎవరూ సాహసించలేని పరిస్థితి ఏర్పడింది. ప్రజలు ఇది గమనించి వారినే దూరం పెట్టారు. ప్రజాస్వామ్యంలో నిరంకుశ విధానాలను ఎవరు అవలంబించినా పతనం తప్పదని రుజువు చేశారు. ఈ క్రమంలో ఆయా రాష్ట్రాల్లో ఉచిత హామీలను పక్కన పెట్టి పాలన సాగించాలి.

# వరదలతో అంటువ్యాధుల ప్రమాదం

**పారిశుధ్య పనులకు పెద్దపీట వేయాలి**
**సీజనల్ వ్యాధుల నివారణకు ఇదే మార్గం**

**విజయవాడ,జూలై27(పీపుల్స్ మోటివేషన్):**

ప్రతి ఏటా వానాకాలంలో అంటు వ్యాధులు ప్రబలడం సర్వసాధారణంగా మారింది. చలికాంల వచ్చే సరికి స్వైన్ ఫ్లూ లాంటి వ్యాధులు విజృంభిస్తుంటాయి. పట్టణాలు,పల్లెలు అనే తేడా లేకుండా స్వచ్ఛంగా ఉంచాలని పదేపదే ప్రచారం చేస్తున్నా ప్రజలు పట్టించుకోవడం లేదు. ఎవరికి వారు తమకేంటన్న భావనతో అపరిశుభ్రతకు కారణమవుతున్నారు. రాష్ట్రంలో గతంలో ప్రజలు డెంగీ, తదితర వైరల్ జ్వరాలతో ఇబ్బందులు పడేవారు. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం ఏలూరులో ప్రజల నిర్లక్ష్యం కారణంగా నగరం కంపు కొడుతోంది. మురుగునీటి పారుదల సక్రమంగా లేకపోవడం వల్ల ఏలూరులో వింతవ్యాధి గతంలో ప్రజలను తీవ్రంగా భయపెట్టింది. ఇటీవలి వరదల వల్ల ఉభయ గోదావరిజిల్లాల్లో అంటువ్యాధుల ప్రమాదం ఏర్పడింది. బురదతో పాటు, మంచినీట సమస్య ప్రజలను వెన్నాడుతోంది. ఇకపోతే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నామని నాయకులు చెపుతున్నా వాస్తవం వేరే రకంగా కనిపిస్తోంది. పారిశుద్ధ్య లేమి కారణంగానే ఇటువంటి వ్యాధులు ప్రబలుతున్న విషయం సుస్పష్టం. ఈ క్రమంలో ప్రజలు పురపాలకసంస్థపై ధ్వజమెత్తుతున్నారు. అపరిశుభ్రత కారణంగా దోమలు విజృంభించడం, వింతవ్యాధులు విజృంభించడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. సీజనల్ వ్యాధుల నివారణ ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. బహిరంగ ప్రదేశాలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీలు దోమల నివారణతో పాటుగా పారిశుద్ధ్య నిర్వహణ చేసేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ పైన దృష్టి సారించి, ప్రభుత్వ ప్రయత్నాలతో కలిసి రావాలి.ముఖ్యంగా దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు సొంత ఇళ్లలోని పారిశుద్యం అత్యంత కీలకమైన అంశం. ఇళ్ళలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాల్సి ఉంది. ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యవంతం చేసి, పారిశుద్ధ్య నిర్వహణలో వారిని భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వ అధికారులు, పురపాలక ప్రతినిధులు కృషి చేస్తూనే ఉన్నారు. ఇళ్ళలో పారిశుధ్య నిర్వహణ చేపట్టి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని పదేపదే కోరుతున్నారు. ముఖ్యంగా దోమల వృద్ధికి అవకాశం ఉన్న ఉన్న నీటి తొట్లు, నీటి నిలువ ప్రదేశాల్లో నీటిని తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. దీంతోపాటు ఇంటి మూలల్లో ఉన్న ఉపయోగంలో లేని వస్తువులను తీసివేసి, దోమల లార్వా వృద్ధికి అవకాశం లేకుండా చేసే చర్యలను చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పారిశుద్ధ్య నిర్వహణ పైన పైన దృష్టి సారించి సీజనల్ వ్యాధుల బారి నుంచి కాపాడుకునే ప్రయత్నం ప్రారంభిం చాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇళ్ళ ముందు కానీ లేదా ఇంటి లోపల నీటి నిలువ ఉండే ప్రాంతాల్లో నీటిని తొలగించే ప్రయత్నం చేయడం లేదా వాటిపైన నూనెను చల్లడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. దీంతోపాటు ఇళ్లలో ఉన్న పనికిరాని లేదా ఉపయోగం లేని లేని వస్తువులను తొలగించుకోవాలని కోరారు. అప్పుడేసీజనల్ వ్యాధులను రాకుండా నిరోధించగలమని అన్నారు. కాలువల్లో వాడిపడేసిన వ్యర్తాలను, ప్లాస్టిక్‌ను పడేయడం వల్ల కూడా మురికినీరు నిలిచి పోతోంది. దీనికి ప్రజలే బాధ్యత వహించాలి. పారిశుద్యానికి ప్రజలు నడుం బిగిస్తేనే మంచిది.



# దుర్గా మంటపాల నిర్వహణకు 365 కోట్లు


**మమత బెనర్జీ నిర్ణయంతో నిధులు వృధా**
**నిధుల దుర్వినియోగంపై విపక్షాల మండిపాటు**

**కోల్‌కతా,జూలై27(పీపుల్స్ మోటివేషన్) :**

పశ్చిమ బెంగాల్‌లో దుర్గాష్టమి నవరాత్రులు అత్యతం వైభవంగా జరుపుకుంటారు. అతిపెద్ద పండుగైన దుర్గాదేవి నవరాత్రులకు రెండు నెలల ముందునుంచే భారీగా ఏర్పాట్లు చేస్తుంటారు. అయితే పండుగకు సంబంధించి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమవుతోంది. పండుగ ఏర్పాట్లకు సంబంధించి అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ఈ క్రమంలోనే.. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దుర్గాదేవి మండపాల నిర్వాహకులకు మరోసారి శుభవార్త చెప్పారు. దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాల నిర్వాహకులపై వరాల జల్లు కురిపించారు. బెంగాల్‌లోని 43వేల దుర్గాదేవి పూజా మండపాల నిర్వాహకులకు ఒక్కొక్కరికి 85వేల రూపాయలు ఇవ్వబోతున్నట్లు సంచలన ప్రకటన చేశారు. ఇది గతేడాది ప్రకటించినదానికంటే 15 వేలు ఎక్కువ కావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇదే ఇప్పుడు వివాదానికి దారి తీస్తోంది. వాస్తవానికి.. దుర్గాదేవి మండపాలకు ప్రతి ఏడాది నిధులను పెంచేలా సీఎం మమతా బెనర్జీ 2011లో నిర్ణయం తీసుకున్నారు. 2011లో దుర్గాదేవి పండుగ నిర్వాహకులకు ఇచ్చే ప్రోత్సాహం 25 వేలతో ప్రారంభం కాగా.. తాజాగా.. 85 వేల రూపాయలకు చేరుకుంది. దుర్గాదేవి పూజా మండపాల నిర్వహణకు గతేడాది 70వేల రూపాయలు అందజేశారు. ఇక.. ఈ సంవత్సరం 85వేల రూపాయలు ఇస్తామని, వచ్చేయేడు లక్ష రూపాయలు ఇస్తామని మమతా బెనర్జీ ప్రకటించారు. అంతేకాదు.. దుర్గాదేవి మండపాలకు ఇచ్చే విద్యుత్ రాయితీని కూడా 75శాతానికి పెంచుతూ బెంగాల్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే.. బెంగాల్ ప్రభుత్వ ప్రకటనలపై పెద్దయెత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవు కానీ.. దుబారా ఖర్చుల కోసం వందల కోట్లు కేటాయిస్తుందని మండిపడుతున్నారు. గతేడాది దుర్గాదేవి పూజా మండపాల కోసం 280కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ప్రభుత్వం.. ఈ ఏడాది 365 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. మొత్తంగా.. విమర్శల సంగతి ఎలా ఉన్నా.. బెంగాల్ ప్రభుత్వ నిర్ణయంపై దుర్గాదేవి పూజా మండపాల నిర్వాహకులు మాత్రం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెలుగు దినపత్రిక
# పీపుల్స్ మోటివేషన్
People's Motivation
ఆదివారం । జులై । 28 । 2024
జనరల్ న్యూస్


# విద్యార్థులకు బుక్స్ యూనిఫామ్ బూట్లు బ్యాగ్ పంపిణీ





**పంపిణీ చేసిన గ్రామ నాయకులు**

**యు కొత్తపల్లి, జూలై 27 (పీపుల్స్ మోటివేషన్):-**

యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ ఎస్సీ పేట మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ప్రతి సంవత్సరం ప్రభుత్వం అందిస్తున్నటువంటి స్టూడెంట్ కిట్స్, బుక్స్ ,యూనిఫామ్స్ ,బూట్లు బ్యాగ్ అందించే కార్యక్రమంలో జనసేన పార్టీ తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొని విద్యార్థులకు చదువు యొక్క విలువ గురించి తెలియజేసి ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని పెట్టుకుని ఆ లక్ష్యాన్ని అందుకోవడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేయాలని ఇలాంటి ప్రయత్నంలో నైతిక విలువలను పాటించాలని తెలియజేశారు . అదే కాకుండా ప్రతి విద్యార్థి చదువుకోవాలని చదువు సంస్కారాన్ని నేర్పిస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంటా విజయ్ కుమార్ రాచపల్లి సనపియ్యా పలివెల నాని ఆకుల లోవరాజు మడద లోవరాజు దాసరి కట్లు మైలపిల్లి రవి నాని రాసిపిల్లి అభిషేక్ మడద రవి మరియు విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం ఆవరణలో మొక్కను నాటారు ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలని వారు కోరారు.

## వైసీపీ సీనియర్ నాయకుడిని పరామర్శించిన ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి



**ఆలూరు, జూలై 27 (పీపుల్స్ మోటివేషన్):-**

శనివారం రోజు ఆలూరు నియోజకవర్గం ఆలూరు మండలం మొలుగువెల్లి గ్రామంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుడు వాల్మీకి రామాంజనేయులు ని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే విరుపాక్షి. వాల్మీకి రామాంజనేయులు కాలుకు ఇన్ఫెక్షన్ అవ్వడం వల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్న ఆయన్ను చూసి ఎమ్మెల్యే భరోసా ఇవ్వడం జరిగింది అదేం కాదులే తొందర్లోనే ఆ దేవుడి దయతో కోలుకుంటారు మీరు మళ్లీ పార్టీలో మంచి క్రియాశీలక పాత్ర పోషించాలని ఆ దేవుని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో మొలుగవెల్లి గ్రామం వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో సంక్షేమ హాస్టలను ప్రారంభించాలి

**జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా**




**దేవనకొండ, జూలై 27 (పీపుల్స్ మోటివేషన్):-**

దేవనకొండ మండల కేంద్రంలో హాస్టల్లో పెట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవనకొండ మండల కేంద్రాల్లో బి మెట్రిక్ పోస్ట్ మెట్రిక్ బాయ్స్ గర్ల్స్ హాస్టలను ఏర్పాటు చేసి విద్యార్థుల చదువు కోవటం కోసం దోహదంపడాలని వారు డిమాండ్ చేశారు కర్నూలు జిల్లా ప్రధానంగా వలసలకు నిలయంగా ఉంటుంది అలాంటి కర్నూలు జిల్లాలో దేవనకొండ మండలంలో హాస్టల్ లేకపోవడంతో విద్యార్థులు హాస్టల్ లేక వాళ్ళ తల్లిదండ్రుల వెంట వలసలకు వెళ్తున్నారని కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి హాస్టల్లో ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు లేని యెడల రాబోయే రోజుల్లో ఉద్యమాలకు శ్రీకారం చుడదాం అనేసి వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రవితేజ నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

## సిస్టం-అనుభవం- కొత్త ఆలోచన

**ఆలూరు నియోజకవర్గ భవిష్యత్తుకు దారి..**






**ఆలూరు, జులై 27 (పీపుల్స్ మోటివేషన్):-**

ఆలూరు నియోజకవర్గ అభివృద్ధి చెందాలంటే మొస రాజకీయాలు పక్కనపెట్టి రెవల్యూషనరీ థింకింగ్ తో కలిసికట్టుగా కొత్త ప్రణాళిక రచించాలి. విద్య, వైద్య, త్రాగునీరు - సాగునీరు అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ క్యాబినెట్ తో నిధులు సమకూరుస్తూ, మరి ముఖ్యంగా మీతో కలిసి ఆలూరు నియోజకవర్గంలో భూ దందాలు, ఇసుక మాఫియా, నకిలీ మద్యం మీద ప్రత్యేక శ్రద్ధ చూపించాలి. జనసేన నిఘా టీం ఉంటుంది నియోజకవర్గంలో తప్పు చేసిన ప్రతి ఒక్కరికి వ్యవస్థతో సమాధానం చెబుదాం. నియోజకవర్గానికి ఒక ఐడెంటిటీ క్రియేట్ చేసే విధంగా అందరు కలిసికట్టుగా ప్రయత్నిద్దాం. నేను కూడా స్కూలు కాలేజీ ఫస్ట్ వచ్చిన వ్యక్తిని, ఆర్థిక భారం వల్ల ఉద్యోగం చేయాల్సి వచ్చింది ఇంజనీరింగ్ తర్వాత. ఇప్పుడు ఒక స్థాయిలో ఉన్నాను. ఆలూరు నియోజకవర్గంలో ఒక గ్రామం దత్తత తీసుకోండి. నేను కూడా తెర్నేకల్ గ్రామం మీద స్పెషల్ ఫోకస్ చేస్తాను తెర్నేకల్ గ్రామంలోని ఉద్యోగ సంఘాల యొక్క కమిట్మెంట్ ను వివరించారు. తెర్నేకల్ గ్రామ స్వరాజ్యం కోసం ఉద్యోగుల సంఘం మరియు యూత్ కమిట్మెంట్ భవిష్యత్తుకు చాలా అవసరం. సిస్టం -అనుభవం- కొత్త ఆలోచన ఆలూరు నియోజకవర్గం భవిష్యత్తుకు దారి.. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వీరేష్, జగదీశ్ బడే సాహెబ్ హెచ్ఎం ఉచిరప్పా, మాజీ ఆర్మీ రామాంజనేయులు, నందు, రామ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవిని, కలిసిన కాంగ్రెస్ శ్రేణులు

**వనపర్తి జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్,గంధం రాజశేఖర్ నాయకులు**



**పెబ్బేరు, జులై 27 (పీపుల్స్ మోటివేషన్):**

హైదరాబాద్ జూబ్లీహిల్స్ లో నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఎంపీ డాక్టర్ మల్లు రవిని, శనివారంరోజు మర్యాదపూర్వకంగా కలిసిన, వనపర్తి జిల్లా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్, అనంతరం అందరితో కలిసి పలు విషయాలపై మాట్లాడుకోవడం జరిగింది. గంధం రాజశేఖర్, టిపిసిసి కాంగ్రెస్ పార్టీ,వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్, ద్యారపోగు వెంకటేష్, వీరపాగ కరుణాకర్, కొమ్ము పవన్ కుమార్ కలిశారు.

## ఏకంగా భార్యను చూడడానికి బస్సునే ఎత్తుకొచ్చిన ఘనుడు



**ఆత్మకూరు, జులై 27 (పీపుల్స్ మోటివేషన్):-**

భార్యను చూడడానికి ఏపీఎస్ఆర్టీసీ బస్సునే తెచ్చాడు ఓ ఘనుడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన దర్గయ్య అనే వ్యక్తికి ముచ్చుమరి గ్రామానికి చెందిన మహిళతో వివాహమైంది. అయితే వృత్తిరీత్యా దర్గయ్య లారీ డ్రైవర్ ఆయన వీధులకు వెళ్లగా గత కొన్ని రోజులుగా భార్య పుట్టినిల్లు ముచ్చుమరి కి వెళ్ళింది. అయితే ఇంటికి వచ్చిన దర్గయ్య భార్య లేదని




శుక్రవారం ఆత్మకూరు డిపోలో ఆగి ఉన్న బస్సును తీసుకొని భార్య ముచ్చుమరి గ్రామానికి వెళ్ళాడు. అయితే విషయం తెలుసుకున్న పోలీసులు ముచ్చుమరిలో బస్సును ఆపి అతని అదుపులోకి తీసుకొని విచారించగా నా భార్య ఇదే గ్రామంలో ఉంది అని భార్యను చూడడానికి ఏమీ లేకపోవడంతో తెల్లవారుజామున ఆత్మకూరు బస్టాండ్ లో బస్సు నిలిచి ఉండడంతో బస్సు కే తాళాలు ఉండడంతో బస్సును తెచ్చుకున్నానని సమాధానం ఇచ్చాడు. అనంతరం ఈ విషయంపై పోలీసులు కుటుంబ సభ్యులను బంధువులను అడగగా అయితే అతనికి మతిస్థిమితం సరిగ్గా లేదని వారు తెలిపారు.

## కాళేశ్వరం ప్రాజెక్టులోని లింక్ -2లో ఎత్తిపోతలు

**శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు**

**పెద్దపల్లి,జూలై27(పీపుల్స్ మోటివేషన్):**

కాళేశ్వరం ప్రాజెక్టులోని లింక్ -2లో ఎత్తిపోతలు ప్రారంభమయ్యాయి. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పరిధిలోని నంది మేడారం పంప్‌హౌస్‌లో అధికారులు మోటార్లు ఆన్ చేశారు. నంది మేడారంలో 4, 6వ మోటార్లను ఆన్ చేసినట్లు అధికారులు తెలిపారు. మరో 3 పంపులు ఆన్ చేసే అవకాశం ఉంది. గాయత్రి పంప్ హౌస్‌కు 6,240 క్యూసెక్కుల నీరు ఎత్తిపోస్తున్నారు. గాయత్రి పంప్‌హౌస్ నుంచి మిడ్ మానేరుకు జలాలు తరలిస్తున్నారు. ఎగువన భారీ వర్షాలు కురవడంతో పాటు ఉత్తర తెలంగాణలో భారీ వర్షాలు పడుతుండడంతో వాగులు, వంకలు ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. కడెం ప్రాజెక్టు, పరివాహక ప్రాంతాల నుంచి భారీగా వరద వస్తోంది. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 20.17 టిఎంసిలుండగా ప్రస్తుతం నీటి నిల్వ 16.91 టిఎంసిలుగా ఉంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు ఇన్‌ఎ÷-లో 14,349 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 331 క్యూసెక్కులు ఉంది.సంగారెడ్డి జిల్లాలో సింగూరు ప్రాజెక్టులోకి భారీగా వరద ప్రవాహం ప్రవహిస్తోంది. సింగూరు ప్రాజెక్టు నీటి సామర్థ్యం 29.91 టిఎంసిలు ఉండగా నీటి సామర్థ్యం 14.06 టిఎంసిలుగా ఉంది. సింగూరు ప్రాజెక్టు ఇన్‌ఎ÷-లో 1595, ఔట్‌ఎ÷-లో 391 క్యూసెక్కులుగా ఉంది.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# కప్పట్రాళ్ల గ్రామంలో సే ట్రీస్ ఆధ్వర్యంలో ఉద్యాన రైతులకు శిక్షణ కార్యక్రమం






**దేవనకొండ, జూలై 27 (పీపుల్స్ మోటివేషన్):-**

శనివారం రోజు మాజీ జిల్లా ఎస్పీ ఆకే రవికృష్ణ దత్తత గ్రామమైన కప్పట్రాళ్ల గ్రామంలోని తాన శ్రీ శక్తి భవనంలో సే ట్రీస్ ఆధ్వర్యంలో ఉద్యానవన రైతుల శిక్షణ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్నూలు జిల్లా ఆర్టికల్చర్ ఆఫీసర్ ( డీహెచ్ఓ) రామాంజనేయులు పాల్గొని ప్రసంగించారు. రైతులకు పండ్ల మొక్కలలో వచ్చే వివిధ రకాల వ్యాధుల గురించి మరియు వాటిని ఏ విధంగా పరిష్కరించవచ్చును అనే విషయాలపై రైతులకు వివరించారు. అదేవిధంగా మొక్క నాటినప్పటినుండి పంట చేతికి వచ్చేంతవరకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రభుత్వం ద్వారా అందుతున్నటువంటి సంక్షేమ పథకాలను వివరించారు. ఉద్యానతోటల ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చునని తెలియజేశారు. ఈ గ్రామాన్ని ఒక యూనిట్ గా తీసుకొని అభివృద్ధి చేస్తామని తెలియజేశారు. సే ట్రీస్ ప్రతినిధి రాహుల్ రైతులకు పండ్ల తోటలలో ఏ విధమైనట్టి యాజమాన్య పద్ధతులు పాటించాలనో తెలియజేశారు. అనంతరం 107 మంది రైతులకు డ్రమ్ములు, కత్తెరలు, మందులు మరియు హార్టికల్చర్ బుక్లెట్స్ ని పంపిణీ చేశారు. అనంతరం కప్పట్రాళ్ల దత్తపుత్రుడు కర్నూల్ మాజీ ఎస్పీ ఆకే రవికృష్ణ ఐపీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బదిలీ అయ్యి సొంత రాష్ట్రానికి రాబోతున్నందుకు గ్రామ ప్రజలు కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకొని ఆనందం వ్యక్తపరిచారు. ఆయనతో వర్చువల్ గా మాట్లాడగా త్వరలో గ్రామానికి వస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ ఆర్టికల్చర్ ఆఫీసర్ దస్తగిరి, సే ట్రీస్ ప్రోగ్రాం మేనేజర్ బి నారాయణ, ఏఎస్ఐ లింగన్న, హార్టికల్చర్ ఆదర్శ రైతు చింతమాను మల్లికార్జున, వారం వెంకటరమణ, చాకలి లక్ష్మన్న, మహాలింగడు, చింత మధు, సే ట్రీస్ సిబ్బంది సుధాకర్ , మద్దయ్య రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తిరిగి ప్రారంభించాలి: ఏఐఎస్ఎఫ్



**నందికొట్కూరు, జులై 27 (పీపుల్స్ మోటివేషన్):-**

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఎత్తివేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని తిరిగి పున ప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మహానంది, వినోద్, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎత్తివేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని తిరిగి ప్రారంభిస్తామని ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఇవ్వగలం పాదయాత్రలో హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు. అయితే కళాశాలలో ప్రారంభమై దాదాపు రెండు నెలలు గడుస్తున్న మధ్యాహ్న భోజన పథకం పై ఎటువంటి స్పందన లేకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేద బడుగు బలహీన వర్గాల పిల్లలు ప్రమటిస్తున్నారని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మానవ దృక్పథంతో స్పందించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జూనియర్ కళాశాల నాయకులు క్రాంతి కుమార్, హేమంత్, సాయి , ప్రవీణ్, శ్రీనాథ్ ,అఖిల్ ,అర్జున్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ కలాం స్మృతి ఎలక్షన్స్ అవార్డు 2024 అందుకున్న జాషువా ఫౌండేషన్ చైర్మన్



**ఆస్పరి, జూలై 27 (పీపుల్స్ మోటివేషన్):-**

ఆస్పరి మండలం పుట్టకలమర్రి గ్రామంలో ఉండే జాషువా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వికలాంగులకు వారి అభివృద్ధి వారి హక్కుల కోసం మరియు మోటివేషన్ ప్రోగ్రాం చేయడం వలన ఫేస్ గ్రూపు వారు డాక్టర్ అబ్దుల్ కలాం స్మృతి ఎక్సలెన్స్ అవార్డు 2024 న్యూస్ పేపర్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ అండ్ బాడ్ క్రాఫ్ట్ భారత దేశ ప్రభుత్వ చేత జాషువా ఫౌండేషన్ చైర్మన్ ఎం దేవేంద్రయ్య కి శనివారం న్యూఢిల్లీ నందు అవార్డు ఇవ్వడం అయినది ఫేస్ గ్రూప్ చైర్మన్ ముస్తాక్ అన్సారీ, సునీల్ గుప్తా ఐపీఎస్ మరియు సురేష్ బాబు, నదియా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పోలవరం నిర్వాసిత కాలనీల్లో మంత్రుల పర్యటన

**బాబు ఆదేశాలతో ..ప్రజల కష్టనష్టాలపై ఆరా**
**వారికి అండగా ఉంటామని హామీ**

**పోలవరం,జూలై27(పీపుల్స్ మోటివేషన్) :**

వైకాపా హయాంలో నిర్వాసితులను గాలికి వదిలేశారని ఏపీ మంత్రులు విమర్శించారు. గోదావరి వరద కారణంగా ఇబ్బందులు పడుతున్న నిర్వాసితులను పరామర్శించాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాలతో మంత్రుల బృందం శనివారం పోలవరం విలీన మండలాల్లో పర్యటించింది. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి, హోం మంత్రి వంగలపూడి అనితతో కూడిన మంత్రుల బృందం కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పర్యటించింది. కుక్కునూరు మండలం దాచారం పునరావాస కాలనీని సందర్శించిన మంత్రులు.. అక్కడ నిర్వాసితులకు అందుతున్న ప్రభుత్వ సహాయాన్ని పరిశీలించారు. సహాయ కార్యక్రమాలపై బాధితులు, అధికారులను ముఖాముఖి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పునరావాస కాలనీల్లో ఉన్న సమస్యలను బాధితులు మంత్రుల దృష్టికి తెచ్చారు. అనంతరం అక్కడి నుంచి వేలేరుపాడు మండలం కన్నాయిగుట్ట చేరుకున్న మంత్రులు గోదావరి వరద ప్రవాహాన్ని పరిశీలించారు. వరద ఉద్ధృతి పెరుగుతున్న నేపథ్యంలో ముంపు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ప్రస్తుతం పునరావాస కాలనీల్లో తలదాచుకుంటున్న వరద బాధితులకు ప్రభుత్వం తరపున నిత్యావసరాలు అందిస్తున్నామని, వరద తగ్గిన తర్వాత ఒక్కో కుటుంబానికి రూ.3 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

## ఓల్డ్ సిటీకి మెట్రో తీసుకొచ్చే ఓట్లు అడుగుతాం

**ఈ నాలుగేళ్లలో మెట్రోను పూర్తి చేసే బాధ్యత మాదే**
**అవసరమైతే అక్బరుద్దీన్‌ను కొండగల్‌లో గెలిపిస్తా**
**డిప్యూటి సిఎంను చేస్తానంటూ..రేవంత్ ఆసక్తికర ప్రకటన**
**ఎంఐఎంలో సంతోషంగా ఉన్నానంటూ అక్బర్ సమాధానం**

**హైదరాబాద్,జూలై27(పీపుల్స్ మోటివేషన్) :**




తెలంగాణ అసెంబ్లీలో చర్చ దుమ్మురేపేలా రసవత్తరంగా సాగింది. గత పదేళ్లలో లేని చర్చలు, మాట్లాడే అవకాశాలు కనిపించాయి. విపక్షాల విమర్శలు.. ప్రభుత్వం కౌంటర్.. ఇలా వాడీవేడిగా బడ్జెట్ పై వాదోపవాదాలు కొనసాగుతున్నాయి.. ఈ తరుణంలోనే.. శనివారం నాడు అసెంబ్లీలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీకి బంపర్ ఆఫర్ ఇచ్చారు.. అది కూడా డిప్యూటీ సీఎం పదవితోపాటు.. ఏకంగా తన పక్కనే కూర్చొబెట్టు కుంటానంటూ పేర్కొన్నారు. దీనికి స్పందించిన అక్బరుద్దీన్ తాను ఎంఐఎం పార్టీలో సంతోషంగా ఉన్నానంటూ వ్యాఖ్యానించారు.. అసెంబ్లీలో ఏం జరిగిందో పరిశీలిస్తే.. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి పదేళ్లు సమయం ఇచ్చారని.. తమకు నాలుగేళ్ల సమయం ఇస్తే చాంద్రాయణగుట్ట మెట్రో స్టేషన్ లో మిమ్మల్ని ఓటు అడుగుతానంటూ పేర్కొన్నారు. తాను గతంలో ఓబీసీ వ్యక్తికి టికెట్ ఇచ్చానని.. తమకు కూడా ఓబీసీలపై ప్రేమ ఉందని.. ఎంఐఎం అతని గెలుపు కోసం సహకరించాలంటూ కోరారు.. ఈ క్రమంలో.. అక్బరుద్దీన్ స్పందిస్తూ తాము ఎటువెళ్లాలంటూ ప్రశ్నించారు. ఈ క్రమంలో ఆసక్తికర సంభాషణ చోటు చేసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ బీఫామ్‌పై కొడంగల్ నుంచి అక్బరుద్దీన్ పోటీ చేస్తే గెలిపించే బాధ్యతను తీసుకుంటానని సీఎం రేవంత్ అన్నారు. చీఫ్ ఎన్నికల ఏజెంట్‌గా ఉండి ఆయనను గెలిపిస్తానని తెలిపారు. అంతేకాకుండా డిప్యూటీ సీఎంగా అక్బరుద్దీన్‌ను తన పక్కనే కూర్చోబెట్టుకుంటానని చెప్పారు. అయితే, రేవంత్ వ్యాఖ్యలపై స్పందించిన అక్బరుద్దీన్ ఒవైసీ.. మజ్లిస్ పార్టీలో తాను సంతోషంగా ఉన్నానని తెలిపారు. చివరి శ్వాస వరకు ఎంఐఎం పార్టీలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. ఇద్దరూ సరదాగా మాట్లాడుకోవడంతో సభలో నవ్వులు విరిశాయి.. ఓ వైపు సీఎం.. మరోవైపు ఎంఐఎం ఎ÷–లోర్ లీడర్ వ్యాఖ్యలను అందరూ ఆసక్తిగా వింటూ నవ్వుకున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ అభివృద్ధిపై మాట్లాడుతూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌కు మెట్రో రైలును తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం. నగరంలో మెట్రో ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే. కానీ ఆ తరువాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం మైట్రో రైలును నిర్లక్ష్యం చేసింది. మేం హైదరాబాద్‌కు తీసుకురాగలిగాం. కానీ గత ప్రభుత్వం ఓల్డ్ సిటీకి మెట్రోను తీసుకురావడంలో పూర్తిగా విఫలమైంది. అసెంబ్లీ వేదికగా మాటిస్తున్నాను. ఈ ప్రభుత్వం గడువు ముగిసేలోగా ఓల్డ్ సిటీకి మెట్రో తీసుకొస్తాం. మెట్రోలోనే వచ్చి ఓల్డ్ సిటీలో ఓట్లు అడుగుతాం. ఒకవేళ అలా జరగని పక్షంలో వచ్చే ఎన్నికల్లో చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీని కాంగ్రెస్ తరఫున కొడంగల్ నుంచి ఎన్నికల్లో పోటీ చేయిస్తాం. కాంగ్రెస్ బీఫారమ్ మీద పోటి చేయించి, అక్బరుద్దీన్ ను గెలిపించుకుంటాం. ఆపై డిప్యూటీ సీఎంగా పదవిలో కూర్చోబెడతాం' అని వ్యాఖ్యానించారు.ఇందులో ఏ సందేహం వద్దు. ఫలక్ నుమా నుంచి చాంద్రాయణ్ గుట్ట వరకు రూ.2675 కోట్లు ఖర్చు పెట్టి మెట్రో రైలు పూర్తి చేస్తాం. భూ సేకరణ పక్రియ సైతం జరుగుతోంది. గౌలిగుడ బస్టాండ్ నుంచి ఫలక్ నుమ, ఫలక్ నుమ నుంచి చాంద్రాయణ గుట్ట వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ మెట్రో రైలు తీసుకొచ్చి చూపిస్తామని' సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఎంఐఎం ఎమ్మెల్యే అకర్బరుద్దీన్ కు హామీ ఇచ్చారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతర రాజకీయ పార్టీల్లోనూ భారీగా చర్చ జరుగుతోంది.

## జగన్ బటన్ నొక్కుడులోనూ అవినీతి

**పూర్తిస్థాయి విచారణ జరిపించాల్సందే**
**మాజీమంత్రి దేవినేని ఉమ డిమాండ్**

**విజయవాడ,జూలై27(పీపుల్స్ మోటివేషన్):**

ఏపీ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి విధ్వంసకర కార్యక్రమాలకు పాల్పడుతున్నారని టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌కు మీడియా ముందు మాట్లాడే ధైర్యం లేదని, అందుకే ఆయన తాడేపల్లి ప్యాలెస్‌లో బ్లూ మీడియాకు పరిమితం అయ్యారని ఎద్దేవా చేశారు. 151సీట్లు గెలిచి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మీరు మీడియా ఎదుటికి రాలేదు, మరిప్పుడు 11సీట్లకే పరిమితమైనా రారా? అంటూ జగన్‌ను ప్రశ్నించారు. చెరువు మీద అలిగినవాడి పరిస్థితి ఏమైందో నేడు అసెంబ్లీపై అలిగిన జగన్ పరిస్థితి కూడా అంతే అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఐదేళ్లలో జగన్ రెడ్డి రూ.12,93,216 కోట్ల ఆర్థిక విధ్వంసం చేశారని, ప్రజలపై రూ.9,74,556కోట్ల భారం మోపారని మాజీ మంత్రి దేవినేని ఉమా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ బటన్ నొక్కుడుతో పేద వర్గాలకు ఎంత వెళ్లాయో, తాడేపల్లి ప్యాలెస్‌కు ఎంత వెళ్లాయో ఆర్థికశాఖ లోతైన విచారణ జరపాలని మాజీ మంత్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఐదేళ్ల పాలనలో రాష్టాన్ని అప్పుల కుప్పగా మార్చారని దుయ్యబట్టారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు 11సీట్లకే పరిమితం చేసినా ఆయన ముఖంలో పశ్చాత్తాపం, పరివర్తన కనిపించడం లేదని మాజీ మంత్రి అన్నారు. ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ జగన్ సిగ్గులేకుండా న్యాయస్థానాల చుట్టూ తిరుగుతున్నారని ఆయన మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు గురించి మాట్లాడే నైతిక హక్కు మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి లేదని మాజీ మంత్రి దేవినేని ఉమా అన్నారు. పోలవరం ప్రాజెక్టు 2,400మీటర్ల విస్తీర్ణం అని జగన్ మాట్లాడుతున్నారు, ఆయన ఇంజినీర్ ఎప్పుడు అయ్యాడో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. 2021సంవత్సరంలో కేంద్రం నుంచి డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానెల్ వచ్చి చెప్పేవరకూ వైసీపీ ప్రభుత్వం మొద్దు నిద్రపోయిందని, వాళ్లు చెప్పేవరకూ వాస్తవాలు బయటకు రాలేదని ఆయన అన్నారు. ఏజెన్సీ మార్చి గత ప్రభుత్వం తప్పుచేసినట్లు కేంద్రం చెప్పిందని, జగన్ రెడ్డి మూర్ఖత్వంతో తీసుకున్న నిర్ణయం వల్ల పోలవరం డయాఫ్రం వాల్ దెబ్బతిన్నట్లు దేవినేని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించాయని ఢిల్లీలో ధర్నా చేస్తారు గానీ అసెంబ్లీ వచ్చి మాత్రం ఆయన మాట్లాడలేకపోతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని పరిస్థితులపై ట్వీట్లు పెడుతున్న జగన్.. అసెంబ్లీకి మాత్రం రావడం లేదన్నారు. కేవలం తాడేపల్లి ప్యాలెస్‌లో నీలి మీడియాకు పరిమితం అయ్యారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఎద్దేవా చేశారు.



తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation
ఆదివారం | జులై | 28 | 2024



# వచ్చే 25 ఏళ్లలో వికసిత్ భారత్

**ప్రతి ఇంటికీ తాగునీరు, విద్యుత్‌పై చర్చ**
**రాష్ట్రాల సహకారంతోనే సాధ్యం**
**నీతి ఆయోగ్ తొమ్మిదవ గవర్నింగ్ కౌన్సిల్**
**ప్రధాని మోడీ అధ్యక్షతన రాష్ట్రపతి భవన్‌లో భేటీ**
**పలు రాష్ట్రాల సిఎంల గైర్హాజరు..మమత వాకౌట్**
**వివరాలు వెల్లడించిన సిఇవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం**

**న్యూఢిల్లీ,జూలై27(పీపుల్స్ మోటివేషన్):**

వచ్చే 25 ఏళ్లలో వికసిత్ భారత్ సాధించే దిశగా ప్రధాని మోదీ కీలక సూచనలు చేశారని నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాకారం అయ్యే ప్రణాళికపై చర్చించామన్నారు. దేశంలో ప్రతి ఇంటికీ తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాల కల్పనపై చర్చించాం. వికసిత్ భారత్‌పై కేంద్రం రూపొందించిన డాక్యుమెంట్‌ను వివరించాం. వికసిత్ భారత్ సాధించడంలో రాష్ట్రాల సహకారం చాలా ముఖ్యం. రాష్ట్రాలు అమలు చేయాల్సిన ప్రణాళికలపై సూచనలు చేశాం. వైద్యరంగంలో తీసుకురావాల్సిన సంస్కరణలపై విస్తృతంగా చర్చించాం అని వివరించారు. నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్రాలకు పలు కీలక సూచనలు చేశారని సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. రాష్ట్రపతి భవన్‌లోని కల్చరల్ సెంటర్‌లో శనివారం నీతి ఆయోగ్ సమావేశం జరిగింది. తొమ్మిదవ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి ప్రధాని మోదీ అధ్యక్షత వహించారు. సమావేశం అనంతరం వివరాలను నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం మీడియాకు వెల్లడించారు. మమతా బెనర్జీకి మాట్లాడే అవకాశం ఇవ్వలేదనటం వాస్తవం కాదు. ప్రతి సీఎంకు మాట్లాడేందుకు 7 నిమిషాల సమయం ఇచ్చాం. ప్రధానంగా రెండు అంశాలపై చర్చ జరిగింది. అలాగే సైబర్ సెక్యూరిటీలో అమలు చేయాల్సిన సాంకేతిక పరిజ్ఞానంపై చర్చించాం. అభివృద్ధి విషయంలో రాష్ట్రాల ప్రణాళికలు కూడా నీతి ఆయోగ్ శ్రద్ధగా విన్నదని, కొన్ని రాష్ట్రాల సూచనలు, వారి ప్రణాళికలు చాలా బాగున్నాయని, తెలంగాణ, తమిళనాడు, కేరళ సహా పది రాష్ట్రాల నుంచి నీతి ఆయోగ్ సమావేశానికి ఎవరూ పాల్గొనలేదని సీఈవో వివరించారు. పలు రాష్ట్రాల సీఎంలు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, కేంద్ర మంత్రులతో పాటు నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్, సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులుగా సమావేశంలో పాల్గొన్నారు. జేడీయూ చీఫ్, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ వ్యవహారశైలి దేశరాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశమవుతోంది. ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న నితీశ్ కుమార్ నీతి ఆయోగ్ మీటింగ్‌కు డుమ్మా కొట్టారు. ఉదయం ప్రారంభమైన 9వ పాలక మండలి భేటీలో పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. ఇక ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఒక్కరే ఈ సమావేశానికి హాజరయ్యారు. మిగతా రాష్ట్రాల సీఎంలు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తమ రాష్ట్రాలపై వివక్ష చూపారంటూ నీతి ఆయోగ్ మీటింగ్‌ను బాయ్‌కాట్ చేశారు. అయితే, వికసిత్ భారత్ -2047 అజెండాగా సాగుతున్న ఈ భేటీకి ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న నితీశ్ కుమార్ గైర్హాజరు కావడం ఇప్పుడు చర్చకు దారితీస్తోంది. ఈ భేటీకి బీహార్ తరఫున డిప్యూటీ సీఎంలు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా హాజరయ్యారు. బీహార్‌కు కేంద్రం ప్రత్యేక హోదా కల్పించకపోవడమే ఇందుకు కారణంగా చెప్పుకుంటున్నారు. తమ డిమాండ్‌ను తిరస్కరించడానికి నిరసనగా.. సీఎం నితీశ్ కీలక భేటీని బాయ్‌కాట్ చేసినట్లుగా తెలుస్తోంది. ఈ సమావేశంలో ఊహించని పరిణామం చోటు చేసుకుంది. సమావేశం నుంచి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వాకౌట్ చేశారు. ఈ సమావేశంలో బెంగాల్‌కు కేంద్ర నిధులు నిరాకరించిన అంశాన్ని ప్రస్తావించగా.. తన మైక్‌ను మ్యూట్ చేసినట్లు దీదీ ఆరోపించారు. ఐదు నిమిషాలకు మించి మాట్లాడేందుకు అనుమతించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే భేటీ నుంచి వాకౌట్ చేసినట్లు తెలిపారు. 'నాకు ఐదు నిమిషాలు మాత్రమే మాట్లాడేందుకు అనుమతించారు. పశ్చిమ బెంగాల్‌కు కేంద్రం నిధులు ఇవ్వడం లేదని సమావేశంలో ప్రస్తావించాను. అంతే నామైక్‌ను మ్యూట్ చేసేశారు. నాకంటే ముందు చాలా మంది మాట్లాడారు. వారికి 20 నిమిషాలు సుదీర్ఘంగా మాట్లాడే అవకాశం ఇచ్చారు. నాకు మాత్రం 5 నిమిషాలు మాత్రమే మాట్లాడేందుకు అనుమతించారు. ఇందుకు నిరసనగా నేను సమావేశం నుంచి బయటకు వచ్చేశాను. విపక్షాల నుంచి నేను ఒక్కదాన్నే ఈ సమావేశంలో పాల్గొన్నప్పటికీ నన్ను మాట్లాడనివ్వక పోవడం అవమానకరం' అని సమావేశం నుంచి బయటకు వచ్చిన అనంతరం దీదీ విలేకరులతో అన్నారు. ఇక ఈ భేటీని విపక్ష పాలిత రాష్ట్ర ముఖ్యమంత్రులు బాయ్‌కాట్ చేశారు. వీరిలో తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ సీఎంలు ఎంకే స్టాలిన్, రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య, భగవంత్ మాన్, సుఖ్‌విందర్ సింగ్ సుఖు ఉన్నారు. తాను నీతి ఆయోగ్ భేటీకి హాజరు కాలేనని కేరళ సీఎం విజయన్ కూడా ప్రధాని మోదీకి లేఖ రాశారు.



# నేడే లాల్ దర్వాజ మహంకాళి బోనాలు

**భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు**
**విస్తృతంగా బందోబస్తు ఏర్పాట్లు**
**పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రులు**
**బోనాల సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు**

**హైదరాబాద్,జూలై27(పీపుల్స్ మోటివేషన్):**

భాగ్యనరంలోని పాతబస్తీ సింహవాహిని మహంకాళి బోనాల మహోత్సవానికి సర్వం సిద్ధమైంది. జాతర సందర్భంగా లాల్ దర్వాజ ముస్తాబు అయ్యింది. పాత బస్తీలోని సింహవాహిని ఆలయంతో పాటు మరో 330 ఆలయాలను శోభాయమానంగా అలంకరించారు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు లాల్ దర్వాజ సింహవాహిని అమ్మవారికి జల్లెకడువ నిర్వహించనున్నారు. తెల్లవారు జామున 4 గంటలకు బలిహరణ, ఉదయం 5.30 గంటలకు దేవి మహాభిషేకం అనంతరం యాత్రికులను దర్శనానికి అనుమతిస్తారు. బోనాలను పురస్కరించుకుని లాల్ దర్వాజ సింహవాహిని ఆలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శాలబండ అక్కన్న మాదన్న ఆలయంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. మరోవైపు కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయంలో మంత్రి దామోదర రాజనర్సింహ, మీరాలం మండి మహంకాళి ఆలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, సబ్జీమండి నల్ల పోచమ్మ ఆలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఇంకా చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎన్టీఆర్ నగర్ సరూర్ నగర్ ఖిలా మైసమ్మ ఆలయంలో మంత్రి దనసరి అనసూయ సీతక్క, నాచారం ఉప్పల్ మహంకాళి సహిత మహాకాళేశ్వర స్వామి ఆలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. లాల్‌దర్వాజ బోనాలకు వచ్చే యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 100 ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచినట్లు గ్రేటర్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. పాతబస్తీ లాల్ దర్వాజ బోనాలు సందర్భంగా 2,500 మంది పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. పాత బస్తీలోని ఫలక్‌నుమా, చార్మినార్, బహదూర్‌పురా, మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈనెల 28, 29 తేదీల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ తెలిపారు. ఆదివారం బోనాల ఊరేగింపు, సోమవారం ఘటాల ఊరేగింపు పాతబస్తీలో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆది, సోమవారాల్లో రాత్రి 11 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు అదనపు సీపీ వెల్లడించారు. అక్కన్న మాదన్న దేవాలయం నుండి నయాపూల్ వరకు ఏనుగుపై ఈ భారీ ర్యాలీ తెల్లవారుజాము నుండి రాత్రి వరకు కొనసాగుతుంది. కాగా.. లాల్ దర్వాజ దేవాలయం, ఎంజీబీఎస్, రెత్తి÷ల్, జేబీఎస్ వద్ద హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు. సమాచారం కోసం 9959226154, 9959 226160 నంబర్లలో సంప్రదించవచ్చని వెల్లడించారు. హిమ్మత్‌పురా నుంచి షంషీర్‌గంజ్ వైపు వెళ్లే వాహనాలను గౌలిపురా, సుధా టాకీస్ మీదుగా మళ్లిస్తారు. చాంద్రాయణగుట్ట, ఉప్పుగూడ నుంచి నగరంలోకి వచ్చే వాహనాలను గౌలిపుర, నాగుల్చింత మీదుగా మళ్లిస్తారు. మహబూబ్ నగర్ ఎక్స్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలను జహనుమా, గోశాల, తాడ్‌బాన్, ఖిలావత్ మీదుగా మళ్లిస్తారు. ఇంజిన్ బౌలి నుండి షంషీర్‌గంజ్ వైపు వచ్చే వాహనాలను మళ్లించడం జరుగుతుంది. చార్మినార్ నుంచి వచ్చే వాహనాలను హరిబౌలి వద్ద మళ్లిస్తారు. చాదర్‌ఘాట్ నుంచి వచ్చే వాహనాలను పురానా హవేలీ రోడ్డు, శివాజీ బ్రిడ్జి వద్ద మళ్లిస్తారు. మొగల్‌పురా, మీర్‌చౌక్ నుంచి వచ్చే వాహనాలను మీర్ కా డియారా వైపు మళ్లించనున్నారు.

# మరోమారు పెరిగిన గోదావరి వరద

**భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక**
**ధవళేశ్రం వద్ద ఉధృతంగా గోదావరి పరవళ్లు**

**భద్రాచలం,జూలై27(పీపుల్స్ మోటివేషన్):**

ఎగువన కురుస్తోన్న భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరికి వరద ఉధృతి పెరుగుతోంది. గత కొద్ది రోజులుగా తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరగడంతో నదీ పరీవాహక ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శనివారం మధ్యాహ్నానికి నీటిమట్టం 52.20 అడుగులకు చేరగా.. రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగించారు. తాజాగా, నీటి మట్టం 53 అడుగులకు పెరగడంతో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. వరద ఉధృతితో భద్రాచలం పరిసర ప్రాంతాలకు రవాణా స్తంభించింది. దుమ్ముగూడెం వెళ్లే రహదారిలో ప్రధాన రహదారులు నీట మునిగి రాకపోకలు బంద్ అయ్యాయి. స్థానిక ఏఎంసీ కాలనీ చుట్టుపక్కల బ్యాక్ వాటర్ చేరుకోవడంతో బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. కాగా, వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గోదావరిలో వరద ప్రవాహం పెరుగుతుండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. క్షేత్రస్థాయిలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేష్ ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని.. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ.. లోతట్టు గ్రామాల ప్రజలను అలర్ట్ చేయాలని సూచించారు. అటు, దుమ్ముగూడెం, పర్ణశాల వద్ద గోదారి నీటిమట్టం 25 అడుగులు దాటింది. సున్నంబట్టి రోడ్డుపైకి గోదావరి నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటు, మలుగు జిల్లా వాజేడు మండలం పేరూరు వద్ద గోదావరికి నీటిమట్టం పెరిగింది. ఈ క్రమంలో వెంకటాపురం నుంచి భద్రాచలం వెళ్లే మార్గంలో భోదాపురం, కుక్కతోగు, బల్లకట్టు వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రహదారిపైకి నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు, తెలంగాణ నయాగరాగా పేరుగాంచిన బొగత జలపాతానికి సైతం వరద పోటెత్తింది. వెంకటాపురం మండలంలో పాలెంవాగు జలాశయం నాలుగు గేట్లు ఎత్తేసి నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షాలతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తోన్న వేళ చేపల వేటకు ఎవరూ వెళ్లొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.ఎగువ ప్రాంతాల నుంచి భారీ స్థాయిలో వరద నీరు రాజమహేంద్రవరం వైపుగా ప్రవహిస్తోంది. ప్రస్తుతం ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 13.75 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. సముద్రంలోకి 12.72 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అటు, కోనసీమలోని గౌతమి, వశిష్ట, వైనతేయ నదీ పాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లంక గ్రామాల్లో వరద నీరు చుట్టుముట్టడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ధవళేశ్వరం నుంచి వరద నీరు సముద్రంలోకి వదులుతుండడంతో యానాంలో ప్రవహించే గౌతమీ గోదావరి బాలయోగి వారధి వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. రాజీవ్ బీచ్ పరీవాహక ప్రాంతంలో మత్స్యకారులు అప్రమత్తమయ్యారు. వారి మెకనైజ్డ్ బోట్లు, నావలు, వలలు కొట్టుకుపోకుండా జాగ్రత్తలు చేపట్టారు.

# శ్రీశైలం జలాశయానికి భారీగా వరద

**సుంకేశుల నుంచి తరలివస్తున్న కృష్ణమ్మ**
**తుంగభద్రకు పెరిగిన వరద ప్రవాహం**

**శ్రీశైలం,జూలై27(పీపుల్స్ మోటివేషన్):**

శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుండి భారీగా వరద ప్రవాహం కొనసాగుతూనే ఉంది. శనివారం సాయంత్రం నాటికి శ్రీశైలం ప్రాజెక్టుకు 2,97,886 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. జూరాల ప్రాజెక్టు విద్యుత్ ఉత్పత్తి ద్వారా 19,683 క్యూసెక్కులు, క్రస్ట్ గేట్ల ద్వారా 2,92,861క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 99,736 క్యూసెక్కుల నీరు శ్రీశైలంకు చేరుకుంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ 885 అడుగులు కాగా, ప్రస్తుతం 866.40 అడుగులుగా ఉంది. పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 127.5950 టీఎంసీలు ఉన్నాయి. 53,795 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని రాజోలి శివారులోని సుంకేశుల జలాశయానికి వరద పోటెత్తింది. ఎగువ నుంచి 82,300 క్యూసెక్కుల వరద వస్తుండగా.. 20 గేట్లు ఎత్తిన అధికారులు నీటిని విడుదల చేశారు. దీంతో 75,220 క్యూసెక్కుల నీరు శ్రీశైలానికి తరలివెళ్తోంది. సుంకేశుల పూర్తి స్థాయి నీటి నిల్వ 1.235 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.507 టీఎంసీలుగా ఉంది. తాగు, సాగు నీరు అందించే జీవనాడి తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం పెరిగిందని డ్యాం బోర్డు అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు జలాశయానికి 1,03675 క్యూసెక్కుల నీరు వచ్చి చేరిందని వెల్లడించారు. ప్రస్తుతం జలాశయంలో 1631.68 అడుగులకు గాను 100.52 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉందని పేర్కొన్నారు. పలు కాల్వలకు, నదికి 1,17,571 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

# కాశ్మీర్లో మరో ఘోర ప్రమాదం

**అదుపుతప్పి లోయలో పడ్డ వాహనం**
**8మంది ప్రయాణికుల దుర్మరణం**

**శ్రీనగర్,జూలై27(పీపుల్స్ మోటివేషన్):**

జమ్ముకశ్మీర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దక్సుం ప్రాంతంలో ఓ వాహనం అదుపు తప్పి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. వీళ్లలో ఐదుగురు చిన్నారులు. ఘటనా స్థలానికి చేరుకున్న రెస్క్యూ టీమ్స్ సహాయక చర్యలు చేపడుతున్నాయి. మృతుల్లో ఓ పోలీస్ కూడా ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. అనంత్‌నాగ్ జిల్లాలోని దక్సుంలో వాహనం ఒక్కసారిగా అదుపు తప్పిందని, నేరుగా లోయలో పడిపోయిందని ప్రాథమికంగా తేల్చారు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన వాళ్లు మృతి చెందినట్టు తెలుస్తోంది. ఘటనా స్థలంలోనే అందరూ చనిపోయారు. అంతకు ముందు కూడా దొడ జిల్లాలో ఈ తరహా ప్రమాదమే జరిగింది. ఓ బస్ లోయలో పడిపోయిన ఘటనలో మహిళ ప్రాణాలు కోల్పోయింది. 9 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మరో వ్యక్తి మృతి చెందాడు. ఈ మధ్య కాలంలో ఇక్కడ వరుసగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. జులై 21వ తేదీన రాజౌరీలో రెండు వేరు వేరు ప్రమాదాల్లో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. 8 మందితో వెళ్తున్న ట్యాక్సీ చలన్ గ్రామంలో ఓ లోయలో పడిపోయింది. అంతకు ముందు జులై 13న దొడ జిల్లాలో ప్రమాదం జరిగి 25 మంది తీవ్రంగా గాయపడ్డారు.

# ప్రభుత్వాన్ని పడగొడతామంటే ఊరుకుంటామా?

**తొడగొట్టి హెచ్చరించిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి**

**హైదరాబాద్,జూలై27(పీపుల్స్ మోటివేషన్):**

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చ సందర్భంగా అధికార పార్టీ కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి 'తొడగొట్టాడు. ఈ ఘటనతో అసెంబ్లీ అంతా ఒక్కసారిగా సైలెంట్ అయిపోయింది.. అసలేం జరుగుతోంది..? ఎందుకింత రచ్చ..? ఎమ్మెల్యే ఎందుకు ఇంత సడన్‌గా ఊగిపోయి మరీ తొడగొడుతున్నారు..? అంటూ సభ్యులంతా ఆయన వైపే చూడసాగారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పట్నుంచీ.. 'ఈ ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండదు.. ఏ క్షణమైనా పడిపోతుంది..' అంటూ అటు బీజేపీ.. ఇటు బీఆర్ఎస్ నేతల నుంచి పెద్ద ఎత్తున చాలెంజ్‌లు వస్తూనే ఉన్నాయి. ఆఖరికి అసెంబ్లీ సమావేశాలకు ముందు కూడా ఇవే మాటలు వచ్చాయ్. దీంతో కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి చిర్రెత్తుకొచ్చింది. అరే.. బై ప్రతిసారి ఈ పడగొడతాం.. పడగొట్టుడు ఏంది అంటూ అసెంబ్లీలోనే ఆగ్రహంతో ఊగిపోయారు. 'ఎవరైనా సరే ప్రభుత్వాన్ని పడగొడతాం అంటే ఊరుకొనేది ప్రసక్తేలేదు. ప్రభుత్వానికి సహకారం ఇవ్వండి అంతే తప్ప.. ఊరికే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొడతాం.. పడ గొడతాం అంటే మేము తొడగొడతాం' అని రామ్మోహన్ రెడ్డి గట్టిగానే మాట్లాడేశారు. మాటలే కాదు చేతల్లోనే తొడగొట్టి పరిగి ఎమ్మెల్యే మరీ చూపించారు . ఎమ్మెల్యే తొడగొట్టుడుతో ఒక్కసారిగా అసెంబ్లీ మొత్తం సైలెంట్ అయిపోయింది. రెండు నిమిషాల తర్వాత తేరుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బల్లలు చరిచారు. అయితే ఇలా చేయడం అనేది ప్రతిపక్షాలకు ఒక మేసేజ్.. రెండోసారి ఇలా అనకుండా ఉండటానికే అని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అయితే.. ప్రజా సమస్యలపై గళం వినిపించి పరిష్కరించాల్సిన అసెంబ్లీలో తొడగొట్టడమేంటి..? అని ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. అయినా పరిగి ఎమ్మెల్యేకు వివాదాలు కొత్తేమీ కాదని.. పరిపాటిగా వస్తున్నాయని విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి. ఇదే అసెంబ్లీలోనే చేవెళ్ల చెల్లమ్మ సబితా ఇంద్రారెడ్డిపైనా రామ్మోహన్ రెడ్డి జోక్స్ వేయడంతో అసెంబ్లీ మొత్తం నవ్వుకున్నా.. బయట మాత్రం విమర్శలు గట్టిగానే వస్తున్నాయి. కొన్నేళ్ల కిందట ప్రభుత్వ ఉద్యోగిపై బూతుపురాణంతో పెద్ద ఎమ్మెల్యే వ్యవహారం హాట్ టాపిక్కే అయ్యింది.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# తెలంగాణ అభివృద్ధికి కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉంది

**ఎపికి రాజధాని లేదు కనుక ఎక్కువ నిధులు ఇచ్చాం**

**కేంద్రమంత్రి రామదాస్ అథవాలే వెల్లడి**

**మెదక్,జూలై27(పీపుల్స్ మోటివేషన్):**

తెలంగాణ అభివృద్ధికి కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి రామదాస్ అథవాలే తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని లేకపోవడంతో ఎక్కువ నిధులు కేటాయించామని పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వానికి అన్ని రాష్ట్రాలు సమానమేనని వివరించారు. దేశంలోని 85 శాతం మంది పేదల కోసం మోదీ సర్కార్ పనిచేస్తుందని చెప్పారు. శనివారం మెదక్ బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి రామదాస్ అథవాలే , మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామదాస్ అథవాలే మాట్లాడుతూ... కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ సామాజిక, ఆర్థిక న్యాయం దిశగా ఉందని ఉద్ఘాటించారు. సబ్ కా సాత్ సబ్‌కా వికాస్ కోసం మోదీ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని తెలిపారు. ఎలాంటి గ్యారెంటీ అవసరం లేకుండా ముద్ర రుణాలను రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచినట్లు వ్యాఖ్యానించారు. ఉజ్వల యోజన పథకం ద్వారా ఇంటింటికీ గ్యాస్ అందిస్తున్నామని చెప్పారు. ప్రధాన మంత్రి అవాస్ యోజన పథకం ద్వారా పేదలకు 3 కోట్ల ఇల్లు ఇచ్చామని అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు ఒక్క ఎంపీ సీటు రాలేదని బీజేపీకి 8 ఎంపీలను ఇచ్చారని తెలిపారు. సౌత్ ఇండియాలో ఎన్డీయే మెజార్టీ స్థానాలు సాధించిందని.. అందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నాయని ఉద్ఘాటించారు. తమ ప్రభుత్వానికి ఎలాంటి ఢోకాలేదని.. ఐదేళ్లు మోదీ నేతృత్వంలో పనిచేస్తామని తెలిపారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం తమ పార్టీ పనిచేస్తుందని రామదాస్ అథవాలే పేర్కొన్నారు. నీతి ఆయోగ్ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి పోకున్నా రాష్ట్రానికి రావాల్సిన నిధులు వస్తాయని మెదక్ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. కేంద్రం రూ.26 వేల కోట్లను కేటాయించిందని రాష్ట్ర బ్జడెట్ సమావేశంలోనే ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారని గుర్తుచేశారు. సీఎం రేవంత్ అవగాహన లేకుండా కేంద్ర బ్జడెట్‌పై మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని మారుస్తున్నామని బట్టకాల్చి మీదేసి కాంగ్రెస్ సీట్లు పెంచుకుందని ఆరోపించారు. నెహ్రూ తర్వాత మోదీ మూడేళ్లు వరుసగా ప్రధాని అయ్యారని గుర్తుచేశారు. నాలుగోసారి గెలిచేందుకు మోదీ సర్కార్ ముందుకు సాగుతోందని వివరించారు. తెలంగాణ పేరు వచ్చిందా.. అని అడుగుతున్నారని.. సీఎం కొడంగల్‌కు కేటాయించిన నిధుల్లాగే మెదక్ నియోజకవర్గానికి కూడా రూ.4, 600 కోట్లు ఇవ్వాలి కదా అని ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు.

# నీతి ఆయోగ్ భేటీని బహిష్కరించడం తప్పు

**తెలంగాణలో వేలకోట్ల రోడ్డు ప్రాజెక్టులు చేపడుతున్నాం**

**రేవంత్ తీరుపై కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి ఆగ్రహం**

**హైదరాబాద్,జూలై27(పీపుల్స్ మోటివేషన్):**

వికసిత్ భారత్ దిశగా అద్భుతమైన బడ్జెట్‌ను మోదీ సర్కారు ప్రవేశ పెట్టిందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పేదల సాధికారత కోసం ఎన్నో పథకాలు తీసుకొచ్చాం. ఈ బడ్జెట్‌లో పేదల అభ్యుదయానికి పెద్దపీట వేశాం. రైతుల పంటకు కనీస మద్దతు ధర కల్పించే దిశగా చర్యలు తీసుకున్నాం అని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార భద్రత స్కీం ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన. ఉత్పాదకత, వ్యవసాయం, యువతకు ఉపాధి వంటి ప్రధాన అంశాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చాం. గతంలో తెలంగాణలో భారాస ప్రభుత్వం పీఎం ఆవాస్ యోజన పథకాన్ని అమలు చేయలేదు. ఈ ఏడాది 5 వేల కోట్ల రూపాయలకుపైగా రైల్వే బడ్జెట్‌ను తెలంగాణకు కేటాయించాం. 48 వేల కోట్ల రూపాయల రోడ్డు ప్రాజెక్టులు తెలంగాణలో చేపడుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం భూములు కేటాయిస్తే మరిన్ని రోడ్లు విస్తరణ చేస్తాం. రామగుండం ఎరువుల కర్మాగారం తిరిగి ఓపెన్ చేశాం. సీఎం నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించడం సరికాదు. ముఖ్యమంత్రికి ఏవైనా విభేదాలు ఉంటే.. తన అభిప్రాయాన్ని నీతి ఆయోగ్ సమావేశానికి హాజరై తెలపాల్సి ఉందని సూచించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించటంపై కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి తీవ్రంగా తప్పుబట్టారు. రాష్ట్రంలో కేంద్రమంత్రి శనివారం నాడు పర్యటించారు. ఈ సందర్భంగా పలు కీలక విషయాలపై రాష్ట్ర బీజేపీ నేతలతో ప్రహ్లాద్ జోషి చర్చించారు. అనంతరం హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ పార్టీపై ప్రహ్లాద్ జోషి తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ హయాంలో ఏపీ, తెలంగాణకు కలిపి రూ.5 నుంచి 6 వేల కోట్లు మాత్రమే గ్రాంట్లు వచ్చాయన్నారు. ఎన్డీయే ప్రభుత్వం రూ.26వేల కోట్లను గ్రాంటుల రూపంలో ఇచ్చిందని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాజకీయాల కోసం అబద్ధాలు చెప్పిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గత ప్రభుత్వం మాదిరి వ్యవహరిస్తే.. కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇప్పటికైనా రేవంత్ ప్రభుత్వం తప్పులను సరిచేసుకోవాలని ప్రహ్లాద్ జోషి హితవు పలికారు.

# బిఆర్ఎస్ హయాంలో 5వేల మందికి డబుల్ పెన్షన్లు

**ఆధారాలతో బయటపెడతానన్న మంత్రి సీతక్క**

**హైదరాబాద్,జూలై27(పీపుల్స్ మోటివేషన్):**

తెలంగాణ అసెంబ్లీలో మాటల యుద్ధం నడిచింది. బడ్జెట్ పై ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఇందుకు ధీటుగా ప్రభుత్వంలోని ఎమ్మెల్యేలు, మంత్రులు అంతే ధీటుగా సమాధానమిచ్చారు. ఈ క్రమంలోనే మంత్రి సీతక్క బీఆర్ఎస్ హయాంలో ఎన్నో అవినీతి అక్రమాలు జరిగాయని వాటన్నిటిని సరిచేస్తూ వస్తున్నామని చెప్పారు. పించన్ల విషయంలో ఎన్నో అవకతవకలు జరిగాయని తెలిపారు. 5 వేల మందికి డబుల్ పెన్షన్లు ఇచ్చారని చెప్పారు. అలాంటి వారి జాబితాను కూడా ప్రకటిస్తామని అన్నారు. ఆనాడు దివాళా తీయించి, అక్రమాలు చేసిన వారు ఇప్పుడు మాట్లాడుతున్న తీరు దారుణం అంటూ విమర్శలు గుప్పించారు. ఈ వ్యాఖ్యలకు హరీశ్ రావు స్పందిస్తూ తాము సరిగ్గా చేయలేదు కాబట్టే ప్రజలు తమను ప్రతిపక్షంలో కూర్చోబెట్టారని చెప్పారు.

# ఆడపిల్లలను వేధిస్తే తాట తీయండి

**వెంకటగిరిలో పోకిరీల ఆట కట్టించండి**

**ఫిర్యాదులపై స్పందించి..పోలీసులకు హుకూం**

**ఆర్జీల స్వీకరణలో తక్షణ పరిష్కారికి పవన్ ఆదేశాలు**

**అమరావతి,జూలై27(పీపుల్స్ మోటివేషన్):**

ఏపీ డిప్యూటీ సీఎం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. బాధ్యతలు స్వీకరించిన దగ్గరి నుంచి ప్రజా సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేస్తున్నారు. తనకు వచ్చిన దరఖాస్తులను వెను వెంటనే పరిశీలించి పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. 'జనవాణి - జనసేన - భరోసా' పేరిట పవన్ కళ్యాణ్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ఆడపిల్లలను వేధిస్తే తాట తీయండి అని పోలీసులు ఆదేశించారు. తిరుపతిలో జులాయిల ఆట కట్టించండని అన్నారు. ఫిర్యాదులపై స్పందించి.. పోలీసులకు హుకూం జారీ చేశారు. ఆర్జీల స్వీకరణలో తక్షణ పరిష్కారికి పవన్ ఆదేశాలు ఇచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత శాఖలకు పంపి, పరిష్కారం కోసం పవన్ కళ్యాణ్ ప్రయత్నిస్తున్నారు. అర్జీల స్వీకరణలో భాగంగా శనివారం నాడు జనసేన పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. దీంతో దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. సమస్యలు త్వరగా పరిష్కారం అవుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ప్రజలు ధన్యవాదాలు చెబుతున్నారు. జనసేన కార్యాలయంలో ఈరోజు కొన్ని దరఖాస్తులను పవన్ కళ్యాణ్ స్వయంగా పరిశీలించారు. అయితే వెంకటగిరిలో మహిళలు, వృద్ధులను వేధిస్తున్నారంటూ ఓ మహిళ పంపిన అర్జీ పవన్‌ను కదిలించింది. వెంటనే ఆయన స్పందించి సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పవన్ కళ్యాణ్- తన కార్యాలయానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలిస్తున్నారు. ఉదయం నుంచి డిప్యూటీ సీఎం తన కార్యాలయ సిబ్బందితో కలసి ప్రతి అర్జీని చదువుతున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, పర్యావరణం, అటవీ శాఖలపై వచ్చిన దరఖాస్తులతో పాటు ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలు, ఎదురవుతున్న ఇబ్బందులను పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత శాఖల అధికారులకు పంపించడంతో పాటు, సమస్య తీవ్రతను బట్టి అధికారులతో పవన్ మాట్లాడుతున్నారు. తిరుపతి జిల్లా వెంకటగిరిలోని ఎన్టీఆర్ కాలనీ, 6వ వార్డు, ఫస్ట్ లేన్ నుంచి మహిళలు, వృద్ధులు తెలిపిన సమస్య పవన్ కళ్యాణ్‌ని కదిలించింది. ముఠాలుగా ఏర్పడిన కొందరు యువకులు బైక్‌లపై ప్రమాదకరంగా, వేగంగా వీధుల్లో సంచరిస్తూ విద్యార్థినులు, యువతులు, మహిళలను వేధిస్తున్నారని వృద్ధులను భయపెడుతున్నారని లేఖ రాశారు. అదే విధంగా యువతుల ఫొటోలు తీసి ఇంటర్నెట్‌లో పెట్టి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, మద్యం తాగి ఇళ్ల ముందు భారీ శబ్దాలు చేస్తూ పాటలు పెట్టడం, ఇళ్లపై రాళ్లు వేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పవన్ కళ్యాణ్ ఎదుట బాధితురాలు వాపోయారు. సదరు యువకుల వివరాలు, బైక్స్‌పై వేగంగా సంచరిస్తున్న ఫొటోలను, వాహనాల నంబర్లను సైతం తమ ఫిర్యాదుకు జత చేశారు. ఆ యువకులను పట్టుకొని హెచ్చరిస్తే ప్రధాన రహదారికి వస్తే దాడి చేస్తామని బెదిరించారని బాధితులు పవన్ కళ్యాణ్‌కు తెలిపారు. యువకులు ఒక మహిళా ఎస్ఐను సైతం వేధించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ ఈ ఫిర్యాదుపై వెంటనే స్పందించి తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడుతో మాట్లాడారు. వెంకటగిరిలోని ఎన్టీఆర్ కాలనీ నుంచి వచ్చిన సమస్యను తక్షణమే పరిష్కరించాలని అన్నారు. ఆడ పిల్లలు, మహిళలను వేధించే వారిపై కఠినంగా వ్యవహరించాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఈ సమస్యపై వెంటనే దృష్టి సారిస్తామని తగు చర్యలు తీసుకొంటామని తిరుపతి ఎస్పీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు తెలిపారు.



# భట్టి బడ్జెట్ ఒక రాజకీయ ప్రసంగం

**ఆదాయాం చూపకుండా కేటాయింపులు**

**ఎక్సైజ్ ఆదాయం గతం కన్నా మిన్నగా చూపారు**

**అభూత కల్పనలతో మసిపూసి మారేడుగాయ**

**బడ్జెట్ ప్రసంగంలో హరీష్ రావు విమర్శలు**

**హైదరాబాద్,జూలై27(పీపుల్స్ మోటివేషన్):**

మల్లు భట్టివిక్రమార్క ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఒక రాజకీయ ప్రసంగంలా ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. ఆదాయాం చూపకుండా కేటాయింపులు చేశారు. ఎక్సైజ్ ఆదాయం గతం కన్నా మిన్నగా చూపారు. అభూత కల్పనలతో మసిపూసి మారేడుగాయ చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన బాగాలేదని మాటలు చెబితే సరిపోతుందా అని ప్రశ్నించారు. రూ.4.5 లక్షలు లేని జీఎస్‌డీపీని రూ.14 లక్షలకు తీసుకెళ్లింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. అసెంబ్లీలో బడ్జెట్‌పై సాధారణ చర్చను ఆయన ప్రారంభించారు. గత ప్రభుత్వ పాలన బాగాలేదని ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. పదేండ్ల పాలనలో ఉన్న సమాచారాన్ని తొలగించారు. కంప్యూటర్ నుంచి తొలగిస్తారేమో కానీ, ప్రజల మెదడు నుంచి తొలగించలేరని పేర్కొన్నారు. అక్షరాలను తొలగిస్తారేమో కానీ, అనుభవాల్ని తొలగించలేరన్నారు. బీఆర్ఎస్ శ్రమను, కాంగ్రెస్ ఎనిమిది నెలల డ్రామాలను ప్రజలు చూస్తున్నారని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్ మొత్తం అవాస్తవాలతో నిండి ఉంది. ట్యాక్స్ రెవెన్యూ ఎక్కువ వస్తుందని బడ్జెట్లో పెట్టారు. పన్నేతర ఆదాయంలో రూ.35 వేల కోట్లు వస్తుందని చూపించారు. ఎలా వస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. విధానాల రూపకల్పన కంటే బీఆర్ఎస్‌ను తిట్టడంపైనే ఎక్కువ దృష్టిపెట్టారన్నారు. గతంలో రుణమాఫీ కోసం భూములు అమ్మితే భట్టివిక్రమార్క, శ్రీధర్‌బాబు విమర్శించారు. ఇప్పుడు రూ.10 వేల కోట్ల విలువ చేసే భూములు అమ్మి నిధులు సమీకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మీ మాటపై గౌరవం ఉంటే భూములు అమ్ముకునే ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సాధ్యంకాని తరహాలో ఆదాయం ఎక్కువ చూపించారని, తప్పనిసరి ఖర్చులను తక్కువ చేసి చూపించారన్నారు. ఏకకాలంలో రుణమాఫీ అన్నారు. బడ్జెట్లో రూ.26 వేల కోట్లు మాత్రమే వస్తున్నది. ఆలస్యం అయిందని రైతుల నుంచి వడ్డీ వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ఆలస్యం చేసి వడ్డీ భారాన్ని రైతులపై మోపుతున్నదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 200 వందల పింఛన్ ఇస్తే బీఆర్ఎస్ పాలనలో రూ.2వేలకు పెంచామని తెలిపారు. అధికారంలోకి రాకముందు రూ.4 వేలు పింఛన్ ఇస్తామన్నారు. ఆ 4 వేల పింఛన్ ఇంకా నాలుక మీదనే ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర బడ్జెట్ అవాస్తవాలతో నిండి ఉంది. ట్యాక్స్ రెవెన్యూ ఎక్కువ వస్తుందని బడ్జెట్లో పెట్టారు. విధానాల రూపకల్పన కంటే మమ్మల్ని తిట్టడంపైనే ఎక్కువ దృష్టి పెట్టారు. నాన్ ట్యాక్స్ రెవెన్యూలో రూ.35 వేల కోట్లు వస్తుందని బ్జడెట్‌లో చూపారు. తప్పనిసరి ఖర్చులను తక్కువ చేసి చూపారు. ఏకకాలంలో రుణమాఫీ అన్నారు. బ్జడెట్‌లో రూ.26 వేల కోట్లు మాత్రమే వస్తోంది. ఆలస్యం అయిందని వడ్డీ రైతుల నుంచి వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ఆలస్యం చేసి వడ్డీ భారాన్ని రైతులపై మోపుతోందని హరీశ్‌రావు విమర్శించారు. మంత్రి కోమటిరెడ్డి హాఫ్ నాలెడ్జ్‌తో మాట్లాడుతున్నారని హరీశ్ రావు అన్నారు. గతంలో డబ్బులిచ్చి టీపీసీసీ తెచ్చుకున్నారని అనలేదా అని ప్రశ్నించారు. బస్సులు సరిపోక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. బస్సులు లేని 15 వందల గ్రామాలకు బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. మహాలక్ష్మి పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మద్దతు ధర సన్నాలకు మాత్రమేనని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని విమర్శించారు. రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. తెలంగాణలో 90 శాతం దొడ్డు వడ్లు పండిస్తారని, దొడ్డు రకానికి బోనస్ ఇవ్వాలన్నారు. గృహజ్యోతి పథకంలో ఇబ్బందులున్నాయని, యువ వికాసం పథకంపై బ్జడెట్‌లో అసలు చర్చే లేదన్నారు. చేయూత గురించి ప్రభుత్వం మాటైనా మాట్లాడటం లేదని విమర్శించారు.

# వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ శాఖల నిర్వీర్యం

**గ్రామీణ ప్రాంతాల్లో పరిపాలనే అస్తవ్యస్తం**

**నిధులు ఇవ్వకుండా స్థానిక సంస్థల నిర్వీర్యం**

**మంత్రి కొల్లు రవీంద్ర**

**మచిలీపట్నం,జూలై27(పీపుల్స్ మోటివేషన్) :**




వైసీపీ ప్రభుత్వంలో అన్ని ప్రభుత్వ శాఖలను జగన్ మోహన్ రెడ్డి నిర్వీర్యం చేశారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అసలు పరిపాలనే లేకుండా చేశారు. నిధులు ఇవ్వకుండా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల హక్కులు కాలరాశారు. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలను వేధించిన అధికారులు, పోలీసులపై చర్యలు ఉంటాయని ఏపీ గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. జగన్ హయాంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం చేసి వారికి ఇష్టమొచ్చినట్లు వాడుకున్నారని మంత్రి ఆరోపించారు. ముఖ్యంగా కొంతమంది పోలీసులు అయితే వైసీపీ కార్యకర్తల్లా పని చేశారని మండిపడ్డారు. అన్యాయంగా కూటమి నేతలపై కేసులు పెట్టారని, జైళ్లల్లో వేధింపులకు గురి చేశారని ధ్వజమెత్తారు. టీడీపీ అధినేత చంద్రబాబును సైతం 50రోజులకు పైగా జైల్లో పెట్టి మానసిక క్షోభకు గురి చేశారని మండిపడ్డారు. మచిలీపట్నంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, చేపట్టాల్సిన పనులపై ప్రజాప్రతినిధులు, అధికారులతో మంత్రి కొల్లు రవీంద్ర చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో అన్ని ప్రభుత్వ శాఖలను జగన్ మోహన్ రెడ్డి నిర్వీర్యం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అసలు పరిపాలనే లేకుండా చేశారు. నిధులు ఇవ్వకుండా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల హక్కులు కాలరాశారు. గత ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు తిట్టిన బూతు పురాణాన్ని ప్రజలు విన్నారు. అందుకే ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో 90శాతానికి పైగా విజయంతో ప్రజలు కూటమికి పట్టం కట్టారు. పోలీసు సిబ్బందిని మాజీ ముఖ్యమంత్రి వైసీపీ కార్యకర్తల్లాగా మార్చుకున్నారు. బదిలీలు, చర్యలు పేరుతో వారిని భయపెట్టి ఇష్టం వచ్చినట్లుగా పని చేయించుకున్నారు. కొంతమంది పోలీసులు అయితే పూర్తిగా వైసీపీ నాయకుల్లా పని చేశారు. కూటమి ప్రభుత్వంలో పోలీసులు చట్టప్రకారమే పని చేస్తారని హామీ ఇస్తున్నా. అధికారులు కూడా అడ్డగోలుగా పని చేసి వ్యవస్థలను భ్రష్టు పట్టించారు. నిబంధనలకు విరుద్ధంగా పని చేసిన అధికారులపై భవిష్యత్‌లో చర్యలు తీసుకుంటామని కొల్లు రవీంద్ర హెచ్చరించారు.జగన్ హయాంలో అక్రమ మద్యం, ఇసుక దోపిడీ విచ్చలవిడిగా సాగింది. డిస్టిలరీలను నిర్వీర్యం చేసిన వైసీపీ నేతలు స్వార్థ ప్రయోజనాల కోసం సొంత కంపెనీలు, బ్రాండ్లు సృష్టించి ప్రజలను మత్తుకు బానిసలుగా చేశారు. పేదల ఆరోగ్యాలతో ఆటలాడుకున్నారు. కల్తీ మద్యంతో ఎంతో మంది ప్రాణాలు పోవడానికి కారణం అయ్యారు. వీరి విధానాల వల్లే ఏపీలో గంజాయి, అక్రమ మద్యం పెరిగిపోయింది. రాష్ట్రంలో ఇకపై ఇలాంటి పరిస్థితులు ఉండవు. పీలో 4,380మద్యం షాపులను 2,934కు తగ్గించినట్లే తగ్గించి మళ్లీ 3,392కు పెంచారు. అమ్మకాల్లో రూ.99వేల కోట్లు నగదు రూపంలోనే వచ్చినట్లు ఎక్సైజ్ శాఖపై సీఎం చంద్రబాబు రిలీజ్ చేసిన శ్వేతపత్రంలో వెల్లడయ్యింది. వైసీపీ ప్రభుత్వం కల్తీ లిక్కర్‌తో పేదల జీవితాలను చిదిమేసింది. ఇకపై రాష్ట్రంలో అలాంటి పరిస్థితులకు స్వస్తి పలుకుతాం. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా ముందుకు వెళ్తుందని మంత్రి కొల్లు రవీంద్ర చెప్పుకొచ్చారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation
ఆదివారం | జూలై | 28 | 2024




# కాలేయ వ్యాధులకు దూరంగా ఉండాలి

**ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి**
**జూలై 28న ప్రపంచ కాలేయ వ్యాధి దినోత్సవం**

**న్యూఢిల్లీ,జూలై27(పీపుల్స్ మోటివేషన్):**

ప్రస్తుతం కాలంలో ఉన్న పరిస్థితులు, ఆహారపు అలవాట్లు, జీవన విధానాలు, ఉద్యోగంలో ఒత్తిళ్లు, మానసిక ఒత్తిళ్లు, నిద్రలేనితనం తదితర కారణాలతో మనిషి ఎన్నో వ్యాధుల బారిన పడుతున్నాడు. ఇందులో హెపటైటీస్ వ్యాధి. ఇది చాలా ప్రమాదకరమైనది. ఇది శరీరంలోని కాలేయంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఏ,బి,సి,డి,ఇలు వెలుగు చూసిన ఈ వ్యాధిలో హెపటైటీస్ వ్యాధి చాలా ప్రమాదకరమైనదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యాధి తీవ్రత సిర్రోలిక్ దశకు చేరుకుని ఏకంగా కాలేయం పూర్తిగా దెబ్బతింటుంది. ఈ దశలోకాలేయం మార్పిడి చేయాల్సి వస్తుంది. అందుకు వ్యాధి బారినపడకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.అయితే 2011లో జూలై 28వ తేదీని ప్రపంచ కాలేయ వ్యాధి (హెపటైటిస్) దినోత్సవాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించి ఈ రోజున సదస్సులు నిర్వహించడం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించింది. దీంతో ప్రతియేటా జూలై 28న ప్రపంచ కాలేయ వ్యాధి దినోత్సవాన్ని జరుపుకొంటున్నాము. హెపటైటిస్ బీ వైరస్ను కనుగొన్న నోబెల్ గ్రహీత బరూచ్ శామ్యూల్ బ్లంబర్గ్ కు గుర్తుగా ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఈ రోజును ఏర్పాటు చేశారు.కాలేయ వ్యాధి ఎక్కువగా ఎవరికి వస్తుంది. ఈ వ్యాధి అధికంగా మద్యం



సేవించే వారికి వస్తున్నట్లు తెలుస్తోంది. శరీరంలో చేరే మద్యాన్ని విసర్జించే క్రమంలో కాలేయం ఎక్కువగా శ్రమకు గురవుతుంది. కాలేయం సామర్థ్యానికి మించి మద్యం సేవించినట్లయితే కాలేయ మెల్లమెల్లగా దెబ్బతింటుంది. ఫలితంగా ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్ డిసీజ్, ఆల్కహాలిక్ హెపటైటీస్ ఆల్కహాలిక్ సిర్రోసిస్ వ్యాధులు దరిచేరుతాయి. ఆల్కహాలిక్ ఫ్యాటి లివర్ డిసీజ్‌లో కాలేయం కణాల్లో కొవ్వు పేరుకుపోతుంది. అలాగే కాలేయం పనితీరు సక్రమంగా ఉన్నా.. ఎంజైమ్ విడుదలలో హెచ్చు తగ్గులు చోటు చేసుకుంటాయి.ఈ పరిస్థితిని మద్యం మానేసి సరిదిద్దుకోవాలి. అతిగా మద్యం సేవించే వారి కాలేయం వాపునకు గురై గట్టిగా తయారవుతుంది. దీనినే ఆల్కహాలిక్ హెపటైటీస్ అంటారు.ఈ వ్యాధితో కాలేయం పనితీరు క్రమంగా అదుపు తప్పుతుంది. వ్యాధి తీవ్రత పెరిగితే కాలేయం విఫలమవుతుంది. హెపటైటిస్ బి, హెపటైటిస్ సి, వైరస్‌ల వల్ల కాలేయం కేన్సర్‌కు దారి తీసే అవకాశం ఎక్కువగా ఉంటుంది..లివర్ క్యాన్సర్ ముప్పుహెపటైటిస్ ఇన్‌ఫెక్షన్ లివర్ క్యాన్సర్‌కు కూడా దారి తీసే అవకాశం ఉంది. సాధారణ కాలేయ క్యాన్సర్‌ను హెపటో సెల్యూలార్ క్యాన్సర్ అని అంటారు. దీర్ఘకాలికంగా ఆల్కహాల్ తీసుకునే వారికి ఈ వ్యాధి ఏర్పడుతుంది. దీన్ని కడుపు పైభాగంలో నొప్పితో పాటు బరువు తగ్గడం వంటి లక్షణాలతో గుర్తించవచ్చు. పసిరికలు, నీళ్ల విరేచనాలు వంటి లక్షణాలు కూడా కనిపిస్తుంటాయి. ప్రాథమికంగా రక్తపరీక్ష (ఏఎఫ్‌బీ), అల్ట్రా సౌండ్ పరీక్షలతో గుర్తించవచ్చు. అవసరాన్ని బట్టి సీటీ స్కాన్, ఎండోస్కోపీ, బయాప్సీ పరీక్షలు చేయించాల్సి ఉంటుంది.'వన్ లైఫ్, వన్ లివర్'.ఈ సంవత్సరం 2023, ప్రపంచ హెపటైటిస్ డే థీమ్ ' వన్ లైఫ్, వన్ లివర్ '. వైరల్ హెపటైటిస్ నివారణ, రోగనిర్ధారణ మరియు చికిత్సను మెరుగుపరచడానికి అవసరమైన కొలతలను వేగవంతం చేయడానికి, తద్వారా కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి మరియు ప్రపంచవ్యాప్తంగా 2030 హెపటైటిస్ నిర్మూలన లక్ష్యాలను సాధించడానికి ప్రపంచవ్యాప్తంగా కృషి చేస్తున్నారు.

# రెండున్నర కోట్ల నగదు కేసు ఛేదన

**పారిపోయిన ఉద్యోగిని పట్టుకున్న పోలీసులు**
**ఎటిఎం నగదుతో పరారైన ఉద్యోగి పట్టివేత**

**రాజమండ్రి,జూలై27(పీపుల్స్ మోటివేషన్):**

సంచలనం సృష్టించిన రెండున్నర కోట్ల నగదు దోపిడీ కేసు నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. కేవలం 12 గంటల్లోనే ఎంతో చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ మీడియాతో మాట్లాడుతూ... హెచ్‌డీఎఫ్‌సీకి సంబంధించిన హిటాచీ ప్రైవేట్ సంస్థ ఉద్యోగులు అశోక్ కుమార్, రాజబాబు లు ప్రతీరోజు ఏటీఎంలలో నగదు నింపుతారని తెలిపారు. మధ్యాహ్నం సమయంలో అశోక్ కుమార్ రూ.2.20 కోట్ల నగదుతో పరారయ్యాడన్నారు. ఐదు పోలీస్ బృందాలతో గాలించామని... కొత్తపేటలో షిఫ్ట్ కారును వదిలి సెల్‌ఫోన్ విడిచి పెట్టి పరారైనట్లు గుర్తించామన్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి నిందితుడ్ని పట్టుకున్నామని తెలిపారు. 50 వేలు కారు అద్దెకు ఇచ్చారన్నారు. రూ.2.20 కోట్లు నిందితుడు నుంచి రికవరీ చేశామన్నారు. ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకుండా రికవరీ చేశామని తెలిపారు. నిందితుడిని 12 గంటల లోపే పట్టుకున్నామని తెలిపారు. నిందితుడు నాలుగేళ్ల నుంచి హిటాచీ సంస్థలో పని చేస్తున్నాడని.. విలాసవంతానికి అలవాటుపడి రెండు వారాలుగా దోపిడీకి పథకం చేసుకున్నాడన్నారు. ప్రతీరోజూ ఏటీఎంలలో నగదు ఫిల్ చేయటం వల్ల ఎక్కువ డబ్బుతో వ్యాపారం చేయాలనే కోరికతో ఇలాంటి దారుణానికి పాల్పడినట్లు ఎస్పీ వెల్లడించారు. నిందితుడిని మండపేట సమీపంలో పట్టుకున్నట్లు చెప్పారు. బ్యాంక్‌లు ఏటీఎంలలో నగదు నింపే బాధ్యతను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగిస్తున్నారని.. బ్యాంక్‌లను కూడా జీపీఎస్‌తో అనుసంధానం చేస్తామన్నారు. సీసీ కెమెరాలు కూడా అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. భవిష్యత్తులో పోలీస్ ప్రజలకు మరింత దగ్గరవుతుందని... రాత్రిపూట రోడ్లపై తిరిగే నేరస్తులను కట్టడి చేస్తామని ఎస్పీ నరసింహ కిషోర్ వెల్లడించారు. పోలీసుల క్విక్ రియాక్షన్‌పై అభినందనలు వెల్లువెత్తున్నాయి. బీఆర్ అంబేదక్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరంపురం మండలానికి చెందిన వాసంశెట్టి అశోక్ కుమార్ హెచ్‌డీఎస్‌సీలో ఉద్యోగం చేస్తున్నాడు. అశోక్ కుమార్ ఏటీఎంలలో నగదు నింపే ఉద్యోగి. ఈ క్రమంలో ఎప్పటిలాగే తోటి సిబ్బందితో కలిసి దానవాయిపేట హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి రెండున్నర కోట్లు నగదు తీసుకొని ఏటీఎంలలో నగదు నింపేదుకు అశోక్ బయలుదేరాడు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుకు చెందిన 19 ఏటీఎంలలో రెండున్నర కోట్ల రూపాయలు ఫిల్లింగ్ చేయాల్సి ఉంది. అయితే మార్గమధ్యలోనే తోటి సిబ్బంది కళ్లుగప్పి నిందితుడు నగదుతో ఉడాయించాడు. విషయం తెలిసిన బ్యాంకు అధికారులు నిందితుడిపై రాజమండ్రి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు అశోక్‌కుమార్ కోసం గాలింపు చర్యలు చేపట్టి 12 గంటలలోపే నిందితుడు అశోక్‌ను అరెస్ట్ చేశారు.

# పంచాయతీరాజ్ డైరెక్టర్ కృష్ణ తేజ మండల పర్యటన

**ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉన్నత అధికారులు రాజకీయ నాయకులు**






**యు కొత్తపల్లి/ పిఠాపురం, జూలై 27 (పీపుల్స్ మోటివేషన్):-**

పంచాయతీరాజ్ డైరెక్టర్ కృష్ణ తేజ యు కొత్తపల్లి మండలంలో శని వారం పర్యటించారు.ఈ పర్యటనలో భాగంగా నాగులపల్లి ఏరియా రక్షిత సమగ్ర మంచినీటి పథకం (సూరప్ప చెరువును) పంచాయతీరాజ్ డైరెక్టర్ కృష్ణ తేజ పరిశీలించారు.ఏయే గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారో వాటి యొక్క వివరాలను. ఆర్ బ్ల్యూఎస్ అధికారులు కృష్ణ తేజకు తెలియజేశారు.అక్కడ గ్రామాలకు సంబంధించి పలు సమస్యలను గ్రామస్తులు, జనసేన పార్టీ నాయకులు పంచాయతీరాజ్ డైరెక్టర్ కృష్ణ తేజకు వివరించారు. అక్కడనుండి నేరుగా గతంలో డిప్యూటీ సీఎం పర్యటించిన ఉప్పాడలో సూరాడపేట కృష్ణ తేజ వెల్లితీర ప్రాంతంలో కోతను పరిశీలించి,మత్స్యకారులను సమస్యలను అడిగి తెలుసుకు న్నారు.అనంతరం అమరవల్లి గ్రామంలో ఉన్న హార్టికల్చర్ మామిడి ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్ కృష్ణ తేజ పరిశీలిం చి రైతుల సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. తదనంతరం కొత్తమూలపేట వెల్లి ఎస్ డబ్ల్యు పి సి తనిఖీ చేచి అక్కడ కూడా పలు సమస్యలపై ఆరా తీసారు ఈకార్యక్రమంలో ఆర్ బ్ల్యూఎస్ అధికారులు, మండల అధికారులు జనసేన నాయకులు పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నీతి ఆయోగ్ భేటీ నుంచి మమత వాకౌట్

**న్యూఢిల్లీ,జూలై27(పీపుల్స్ మోటివేషన్):**

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నీతి ఆయోగ్ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. రాష్ట్రానికి నిధుల కేటాయింపు గురించి మాట్లాడటం ప్రారంభించగానే తన మైక్ ఆఫ్ చేశారని ఆరోపిస్తూ ఆమె సమావేశం నుంచి బయటకు వచ్చారు. కేంద్ర బడ్జెట్‌లో పశ్చిమబెంగాల్‌పై వివక్ష చూపారని, రాష్ట్రానికి నిధులు కేటాయించాలంటూ మాట్లాడటం ప్రారంభించగానే వారు నా మైక్ ఆపేశారు. నేను మాట్లాడకుండా అడ్డుకున్నారు. ఎందుకు వివక్ష చూపుతున్నారని నేను ప్రశ్నించాను. విపక్షాల నుంచి హాజరైంది నేను ఒక్కదాన్నే. నన్నొక్కదాన్ని కూడా వారు ఆపారు.

# అవినీతికి పరాకాష్టగా కెసిఆర్ పాలన

**పదేళ్లలతో దోపిడీ చేయని రంగం లేదు**
**గొర్రెల స్కాం, కేసీఆర్ కిట్లు, బతుకమ్మ చీరల్లో స్కాం**
**గొర్రెల పంపిణీ పథకంలో రూ.700 కోట్ల అవినీతి**
**అబద్దాలతో సభను ఇంకా తప్పదోవ పట్టించలేరు**
**అసెంబ్లీతో ఘాటుగా సమాధానం ఇచ్చిన సిఎం రేవంత్**

**హైదరాబాద్,జూలై27(పీపుల్స్ మోటివేషన్):**

అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చి సందర్భంగా హరీష్ రావు వ్యాఖ్యలకు సిఎం రేవంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. గత బిఆర్ఎస్ సర్కార్ పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పదేళ్లలో బీఆర్ఎస్ అన్ని రంగాల్లో అవినీతి చేసిందని అసెంబ్లీలో మండిపడ్డారు. గొర్రెల స్కాం, కేసీఆర్ కిట్లు, ఆఖరుకు ఆడ బిడ్డలకు ఇచ్చే బతుకమ్మ చీరల్లోనే స్కాం చేశారని విమర్శించారు. ఇంత జరిగినా సభలో మాజీ మంత్రి హరీశ్... ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని కౌంటర్ ఇచ్చారు. ఇలా తప్పుడు లెక్కలు చెప్తేనే ఎంపీ ఎన్నికల్లో ప్రజలు గుండుసున్నా ఇచ్చారని ఎద్దేవా చేశారు. రంగారెడ్డి జిల్లాలో భూములను కొల్లగొట్టి..చేవెళ్ల ప్రాజెక్టును నిర్వీర్యం చేసి..సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. భారాస ప్రభుత్వ హయాంలో గొర్రెల పంపిణీ పథకంలో రూ.700 కోట్ల అవినీతి జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అప్పుల లెక్కలు చెప్పిన హరీశ్‌రావు అమ్మకాల లెక్కలు చెప్పట్లేదు. భారాస హయాంలో రూ.లక్షల కోట్ల విలువైన ఓఆర్ఆర్‌ను రూ.7 వేల కోట్లకు అమ్మారు. పదేళ్లలో పాలమూరు జిల్లా ప్రాజెక్టులు పూర్తి చేయలేదు. కేసీఆర్ పాలనలో రంగారెడ్డి జిల్లాలో భూములు అమ్ముకున్నారు. బతుకమ్మ చీరలు అని చెప్పి సూరత్ నుంచి కిలోల లెక్క తీసుకువచ్చి పంపిణీ చేశారు. బతుకమ్మ చీరలు, గొర్రెల పంపిణీపై విచారణకు సిద్ధంగా ఉన్నారా అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. హరీశ్ నోరు తెరిస్తే అబద్దాలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. నిండు సభలో అబద్దాలు మాట్లాడితే సహించమోన్నారు. మోటార్లకు మీటర్లు పెడుతామని 2017లో అప్పటి ప్రభుత్వం ఒప్పుకుంది నిజం కాదా..అని ప్రశ్నించారు. ఆధారాలతో సహా డాక్యుమెంట్లను హరీశ్ కు ఇస్తున్నామని చెప్పారు. అబద్దాలను రికార్డ్‌ల నుంచి తొలగించకుంటే కొత్త సభ్యులు నిజమనుకుంటారని అన్నారు. బీఆర్ఎస్ నేతలు ప్రజల్ని మభ్యపెట్టాలని చూస్తున్నారని మండి పడ్డారు. సభలో సభ్యులు తప్పు మాట్లాడితే సరిదిద్దాల్సిన బాధ్యత సభానాయకుడిగా తనపై ఉందన్నారు రేవంత్.. ప్రతిపక్షానికి తగిన సమయం ఇచ్చామన్నారు. మంత్రి కోమటిరెడ్డి అన్నట్లు హాఫ్ నాలెడ్జ్ ..కెసిఆర్‌ది ఫుల్ నాలెడ్జ్ అంటూ చేయిచూపుతూ ఎద్దేవా చేశారు. హరీష్ రావు సభను సభ్యులు తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. మోటార్లకు మీటర్ల విషయంలో వాళ్లేదో కేంద్రంతో నిలబడి కొట్లాడినట్లు మాట్లాడుతున్నరు. ఇది అబద్ధం... వారి తప్పులను కప్పి పుచ్చుకోవడానికి సభలో బుకాయించడం సరికాదు. ఈ విషయంలో రికార్డులను సవరించాల్సిన అవసరం ఉంది. మీటర్ల విషయంలో గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను సభ ముందు ప్రవేశపెడుతున్నా. ఆరు నెలల్లో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్ వద్ద మీటర్లు బిగిస్తామని 4 జనవరి 2017న ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందంపై అధికారులు అజయ్ మిశ్రా, రఘుమా రెడ్డి, ఏ.గోపాల్ రావు సంతకం పెట్టారు. మోదీ ప్రభుత్వంతో ఆనాడు ఆరు నెలల్లోగా డిస్టిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్స్‌కు మీటర్లు బిగిస్తామని కేసీఆర్ ఒప్పందం కుదుర్చుకున్నారు. సభలో నోరు తెరిస్తే అబద్దాలు మాట్లాడుతున్న హరీష్ రావు.. వారి హయాంలో జరిగిన ఒప్పందాలను చదువుకుని మాట్లాడాలని సూచించారు. అబద్దాలతో హరీష్ రావు ఊకదంపుడు ఉపన్యాసం ఇస్తున్నారన్నారు. ప్రజలను మభ్య పెట్టాలని చూస్తే వారు నమ్మడానికి సిద్ధంగా లేరని చెప్పారు. 'ప్రజలు శిక్షించినా వాళ్ల ఆలోచన మారలేదు.. అదే ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారు. లక్షల కోట్ల విలువైన ఔటర్ రింగ్ రోడ్డును రూ.7వేల కోట్లకే తెగనమ్మారు. గొర్రెల స్కీం పేరుతో కోట్ల రూపాయలు దండుకున్నారు. గొప్ప పథకం అని చెప్పిన బతుకమ్మ చీరల్లోనూ అవినీతికి పాల్పడ్డారు. ఆడబిడ్డల సెంటిమెంట్ నూ దోపిడీకి ఉపయోగించు కున్నారు. కురుమ, యాదవుల సోదరులను అమాయకులను చేసి కోట్లాది రూపాయలు దోచుకున్నారు. కాళేశ్వరం ఖర్చు విషయంలోనూ గతంలో ఒకటి చెప్పి...ఇప్పుడు రూ.94వేల కోట్లు అని చెబుతున్నారు. ఆని ఫైర్ అయ్యారు. తెలంగాణ వ్యాప్తంగా బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎన్ని భూములు అమ్మిందో లెక్కలు తీద్దామా అని సవాల్ చేశారు. 'మీరు ఎన్ని వేల కోట్ల విలువైన భూములు అమ్మారో లెక్క తీద్దాం. అప్పుల లెక్కలు చెబుతున్నారు... కానీ అమ్ముకున్న లెక్కలు చెప్పడంలేదు. పదేళ్లయినా పాలమూరుకు చేసిందేం లేదు.

# కమలాహ్యారిష్‌కు భారీ విరాళం

**కథనాలతో నెట్‌ఫ్లిక్స్ బాయ్‌కాట్‌కు పిలుపు**
**నెట్టింట్ జోరుగా సాగుతున్న చర్చ**

**వాషింగ్టన్,జూలై27(పీపుల్స్ మోటివేషన్):**

ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌ను బాయ్‌కాట్ చేయాలంటూ నెట్టింట్లో హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అవుతోంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో భాగంగా డెమోక్రాటిక్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థి రేసులో ఉన్న కమలా హారిస్‌కు ఆ ఓటీటీ సహ వ్యవస్థాపకుడు రీడ్ హేస్టింగ్స్ భారీ విరాళం ఇచ్చినట్లు కథనాలు వెలువడటమే అందుకు కారణం. ఆయన సుమారు 7 మిలియన్ల డాలర్లు విరాళం ఇచ్చినట్లు వాటి సారాంశం. ఒక రాజకీయ ప్రచారానికి ఇప్పటివరకు హేస్టింగ్స్ ఇచ్చిన పెద్దమొత్తం ఇదేనని సమాచారం. నిరాశకు గురిచేసిన డిబేట్ తర్వాత మేం మళ్లీ గేమ్‌లోకి వచ్చాం అని హారిస్‌ను ఉద్దేశించి హేస్టింగ్స్ వెల్లడించినట్లు తెలుస్తోంది. దాంతో క్యాన్సిల్ నెట్‌ఫ్లిక్స్ హ్యాష్‌ట్యాగ్ నెట్టింట్లో ట్రెండ్ అవడం మొదలైంది. నేను గతంలోనే ఆ పనిచేశా. మీరు క్యాన్సిల్ చేయకపోతే ఇప్పుడు చేయండి అని ఓ నెటిజన్ రాసుకొచ్చారు. మనకు ఎన్నో ఓటీటీలు అందుబాటులో ఉన్నాయి. దేశభక్తులారా ఏం చేయాలో మీకు తెలుసుగా..? ఆయన మద్దతుకు ప్రతిఫలం అందించండి అంటూ మరొకరు తీవ్ర నిరసన వ్యక్తంచేశారు. వీరంతా మాజీ అధ్యక్షుడు ట్రంప్ మద్దతుదారులని కొన్ని కథనాలు పేర్కొన్నాయి. ఇదిలాఉంటే.. కొన్ని నెలల్లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్న తరుణంలో ఇటీవల కాలంలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ట్రంప్‌పై ఒక దుండగుడు హత్యాయత్నానికి పాల్పడటంతో ఆయనకు లభిస్తోన్న మద్దతు అనూహ్యంగా పెరిగింది. అదే సమయంలో ప్రత్యర్థి వర్గంలో మార్పులు జరిగాయి. అధ్యక్షుడు జో బైడెన్ పోటీ నుంచి వైదొలిగారు. హారిస్‌కు తన మద్దతు ఉంటుందని చెప్పారు. ఆ తర్వాత నుంచి ఆమెకు స్వపక్షంలోను మద్దతు పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలోనే ఆమెపై ట్రంప్ వర్గం నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

# కాల్పులు జరిగిన చోటే ర్యాలీ నిర్వహిస్తా

**మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటన**

**వాషింగ్టన్,జూలై27(పీపుల్స్ మోటివేషన్):**

పెన్సిల్వేనియా ర్యాలీలో తనపై కాల్పులు జరిపిన చోటే మళ్లీ ర్యాలీ నిర్వహిస్తానని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. సోషల్ మీడియా పోస్టులో మా ప్రియమైన కోరే గౌరవార్థం ఆయనను స్మరించుకుంటూ నాపై కాల్పులు జరిగిన చోటే ర్యాలీ నిర్వహించబోతున్నాను. ర్యాలీ కోసం పెన్సిల్వేనియాలోని బట్లర్‌కు తిరిగి వెళ్తున్నాను. ఈ కార్యక్రమానికి సంబంధించిన విషయాలను త్వరలో తెలియజేస్తాను అని పేర్కొన్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ పై జరిగిన హత్యాయత్నం సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ కాల్పుల్లో మాజీ అగ్నిమాపక సిబ్బంది కోరీ కంపెరాటోర్ ప్రాణాలు కోల్పోయారు. తన కుటుంబాన్ని కాపాడుకొనే క్రమంలో దుండగుడి తూటాకు బలయ్యాడు. తాజాగా జరిగిన బహిరంగ సభలో ట్రంప్ అతడిని గుర్తుచేసుకుంటూ ప్రత్యేకంగా నివాళులర్పించారు. కాగా మళ్లీ కోరీ గౌరవార్థం సభను నిర్వహించనున్నట్లు ట్రంప్ ప్రకటించారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

## యానిమల్‌తో ఎంతో నేర్చుకున్నా: తృప్తి దిమ్రీ

యానిమల్'తో సూపర్ సక్సెస్ సొంతం చేసుకున్న నటి త్రిప్తి దిమ్రీ. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె 'యానిమల్ పార్క్' గురించి స్పందించారు. రణ్‌బీర్ కపూర్, రష్మిక జంటగా నటించిన యాక్షన్ డ్రామా 'యానిమల్' ఇందులో జోయాగా కనిపించి యువత మనసు దోచేశారు నటి త్రిప్తి దిమ్రీ. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో పాల్గొని.. 'యానిమల్'పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆ సినిమా తన కెరీర్‌కు ఏవిధంగా ఉపయోగపడిందనేది చెప్పారు. 'యానిమల్ పార్క్' గురించీ మాట్లాడారు. యానిమల్' నా కెరీర్‌కు ఎంతో ఉపయోగపడింది. దాని తర్వాత నాకు అభిమానులు ఎక్కువయ్యారు. నా గత చిత్రాలను చూస్తున్నారు. అందులో భాగమైనందుకు ఆనందంగా ఉన్నా. ఎంతోమంది గొప్ప నటీనటులతో వర్క్ చేయడం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకున్నా. మా చిత్రానికి తీవ్ర విమర్శలు వచ్చినమాట వాస్తవమే. సినీరంగంలో ఇలాంటివి సాధారణమేనని నా భావన. ప్రతిఒక్కరూ ఏదోఒక సమయంలో ఇలాంటివి ఎదుర్కొంటూనే ఉంటారు అని తెలిపారు. నిజం చెప్పాలంటే.. సినీప్రియుల మాదిరిగానే నాక్కూడా 'యానిమల్ పార్క్' ఎప్పుడు మొదలవుతుందో తెలియదు. ఆ సినిమా కథ ఏమిటి? షూటింగ్ ఎప్పటినుంచి ప్రారంభిస్తారు? అనే విషయాలపై ఏమాత్రం అవగాహన లేదని చెప్పారు. 'యానిమల్'ను సందీప్‌రెడ్డి వంగా తెరకెక్కించారు. తండ్రీ తనయుల సెంటిమెంట్‌తో రూపొందించారు. ఇందులో తీవ్ర హింసను ప్రోత్సహించడం ఏం బాలేదంటూ గతంలో పలువురు బాలీవుడ్ దర్శక – నిర్మాతలు, రచయితలు విమర్శలు చేశారు. 'యానిమల్'కు కొనసాగింపుగా 'యానిమల్ పార్క్' రానుంది. 'యానిమల్ పార్క్' చిత్రీకరణను 2026లో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నాం. మొదటిభాగం కన్నా మరింత భారీగా.. హింసాత్మకంగా.. ప్రేక్షకుల ఊహాలకు అందని యాక్షన్ సన్నివేశాలతో దీన్ని తీర్చిదిద్దుతున్నా' అని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సందీప్‌రెడ్డి వంగా తెలిపారు.



## అక్టోబర్ 4న జపాన్‌లో హనుమాన్ విడుదల

తేజ సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన చిత్రం 'హనుమాన్' సినిమా జపాన్‌లో రిలీజ్‌కు సిద్ధమైంది. అక్టోబర్ 4న అక్కడి ఈ చిత్రం అలరించనుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర దర్శకుడు ప్రశాంత్ వర్మతాజాగా ట్వీట్ చేశారు. 'విడుదలైన అన్నిచోట్ల సెన్సేషన్ క్రియేట్ చేసిన 'హనుమాన్' ఇప్పుడు జపాన్ ప్రేక్షకుల ముందుకు రానుంది. అక్కడి వారికి వినోదాన్ని పంచనుంది. అక్టోబర్ 4న జపనీస్ సబ్‌టైటిల్ వెర్షన్ విడుదల కానుందని పేర్కొన్నారు. దీనికి హ్యాష్‌ట్యాగ్ జత చేశారు. సూపర్ హీరో కథకు ఇతిహాసాన్ని జోడించి తీసిన ఈ చిత్రంలో తేజ సజ్జా హీరోగా నటించగా.. అమృతా అయ్యర్ కథానాయికగా నటించారు. వరలక్ష్మి శరత్‌కుమార్, వినయ్ రాయ్, గెటప్ శ్రీను, వెన్నెల కిషోర్ కీలక పాత్రల్లో కనిపించారు. రూ.40 కోట్ల వ్యయంతో తెరకెక్కిన ఈ చిత్రం సుమారు రూ.300 కోట్లకు పైగా వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రానికి 'జై హనుమాన్' రానుందని చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. 'శ్రీరాముడికి హనుమంతుడు ఇచ్చిన మాటేమిటి?' అనే ప్రశ్నకు సమాధానంగా 'జై హనుమాన్' రూపుదిద్దుకోనుంది. 2025లో ఈ సినిమా విడుదల కానుంది. జనవరి నెలలోనే ప్రీ ప్రొడక్షన్ పనులు మొదలయ్యాయి. 'హను-మాన్' కంటే వందరెట్లు భారీ స్థాయిలో 'జై హనుమాన్' ఉంటుంది. సీక్వెల్‌లో తేజ సజ్జా హీరో కాదు. హనుమంతు పాత్రలో కనిపిస్తాడు. హీరో ఆంజనేయ స్వామి. ఆ పాత్రను స్టార్ హీరో చేస్తారు అని ప్రశాంత్ ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.







## అల్లరి నరేశ్ కొత్త సినిమా ప్రారంభం

వరుస సినిమాలతో ప్రేక్షకులను పలకరించే అల్లరి నరేశ్ తాజా సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. మెహర్ తేజ్ దీనికి దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ వచ్చే వారం నుంచి మొదలుకానున్నట్లు చిత్రబృందం తెలిపింది. 'మీరు అతని కంటి నుంచి తప్పించుకోలేరు' అనే క్యాప్షన్‌తో దీనికి సంబంధించిన ఫొటోలను నిర్మాణ సంస్థ షేర్ చేసింది. నరేశ్ 63వ చిత్రంగా తెరకెక్కనున్న ఇందులో యంగ్ హీరోయిన్ రుహానీ శర్మ కీలకపాత్రలో కనిపించనున్నారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై ఇది రానుంది. దీపికా పదుకొణెతో ఇంటిమేట్ సీన్స్.. భయాందోళనకు గురయ్యా: బాలీవుడ్ నటుడు 'ఆ.. ఒక్కటీ అడక్కు' అంటూ ఇటీవల నవ్వులు పంచిన అల్లరి నరేశ్ ప్రస్తుతం 'బచ్చల మల్లి'తో బిజీగా ఉన్నారు. సుబ్బు మంగదేవి దీన్ని తెరకెక్కిస్తున్నారు. నరేశ్ మాస్ రగ్గడ్ లుక్‌లో మునుపెన్నడూ చూడని విధంగా కనిపించనున్న ఈ చిత్రంలో ఆయన సరసన అమృత అయ్యర్ ఆడిపాడనున్నారు.




## బోనాల కానుకగా నేడు మిస్టర్ బచ్చన్ టీజర్ విడుదల

మాస్ మహారాజా రవితేజ, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబోలో వస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్ తో సునా హోగా' అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి షో రీల్‌తో పాటు పాటలు విడుదల చేయగా ఫుల్ రెస్పాన్స్ వచ్చింది. అయితే ఈ సినిమాను ఇండిపెండెన్స్ కానుకగా ఆగష్టు 15న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించిన విషయం తెలిసిందే. విడుదలకు ఇంకా 18 రోజులే ఉండడంతో ప్రమోషన్స్ వేగం పెంచింది. ఇందులో భాగంగా ఈ మూవీ నుంచి టీజర్ అప్‌డేట్‌ను ప్రకటించింది చిత్రయూనిట్. ఈ మూవీ టీజర్‌ను బోనాల పండుగ కానుకగా ఆదివారం విడుదల చేయనున్నట్లు తెలిపింది. మిరపకాయ్ సినిమా తర్వాత రవితేజ, హరీశ్ శంకర్ కాంబోలో ఈ సినిమా వస్తుండడంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. రవితేజ ఈ చిత్రంలో అమితాబ్‌బచ్చన్ అభిమానిగా కనిపించనున్నాడు. ఈ చిత్రంలో రవితేజ ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నాడు

Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com